మానేరు **జనత**®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

25.1.2026 ఆదివారం Sunday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 276 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
ప్రోత్సాహకులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## ఒకే మ్యాచ్‌లో 5 ప్రపంచ రికార్డులు గల్లంతు




07



# నాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం

**ఫర్నిచర్ షాపులో చెలరేగిన మంటలు**

- పది గంటలకు పైగా పోలీస్, ఫైర్ సిబ్బంది ఆపరేషన్
- 8 ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నం
- ఫైర్ రోబో ప్రవేశపెట్టినా ఫలితం శూన్యం
- నలుదిక్కులా దట్టమైన పొగలతో సహాయక చర్యలకు ఆటంకం
- లోపల ఆరుగురు చిక్కుకున్నట్టు గుర్తింపు

నాంపల్లిలోని ఓ ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పది గంటలకు పైగా ఫైర్, పోలీసులు, హైడ్రా సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు. 8 ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేస్తున్నారు. 2 కుటుంబాలకు చెందిన ఆరుగురు మంటల్లో చిక్కుకున్నారని, వారు బతికే అవకాశం లేదని అధికారులుచెప్పున్నారు.





### భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా
# ఎదుగుతోంది

## దేశవ్యాప్తంగా 18వ రోజ్‌గార్ మేళా

- ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి
- వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి
- 61,000 మందికి నియామక పత్రాలు అందించిన మోదీ

దేశవ్యాప్తంగా శనివారం జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు.


వివరాలు 3లో

## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

27న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు



3



### యధాతథంగా
## టీహబ్ కార్యాలయం

ప్రభుత్వ కార్యాలయాల మార్చవద్దన్న సీఎం
అమెరికా నుంచి సీఎస్‌కు రేవంత్ ఆదేశాలు

.. వివరాలు 2లో



### మున్సిపల్ ఎన్నికలకు
## బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్‌లు

మున్సిపాలిటీల వారీగా సమన్వయ కర్తల నియామకం

.. వివరాలు 2లో

### తెలంగాణ జాగృతి
## సింహ గర్జన

స్థానిక ఎన్నికల బరిలో దిగేలా మాస్టర్ ప్లాన్
ఫార్వర్డ్ బ్లాక్ సింహం గుర్తు పై పోటీ

.. వివరాలు 2లో

# సింగరేణిపై కట్టుకథలు

## సైట్ విజిట్ నిబంధన గతంలో ఉన్నదే

- ఎవరి ప్రయోజనం కోసం.. ఎవరు చేస్తున్నారు
- ఒకరు కథనం..మరొకరు లేఖ...ఇంకొకరు విచారణ
- వీరికి ఉన్న సబంధం ఏమిటో ప్రజలకు తెలియాలి
- సింగరేణిపై కిషన్ రెడ్డి విచారణను స్వాగతిస్తున్నాం
- అన్ని వ్యవహారాలపై విచారణ జరగాలన్నదే తన అభిప్రాయం
- మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి




**జనతా న్యూస్, హైదరాబాద్ :** హైదరాబాద్, జనవరి 24: సింగరేణి పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు రాతలు రాస్తున్నారని, ఈ నినాదాల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? అంటూ ప్రశ్నలు సంధించారు. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు మోపుతూ, కార్మికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని డిప్యూటీ సీఎం ఆగ్రహించారు. శనివారం నాడు ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిపై కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 'ఒకరు కథనం రాశారు, మరొకరు లేఖ రాశారు, ఇంకొకరు విచారణకు ఆదేశించారు, ఈ ముగ్గురికీ ఉన్న సంబంధం ఏంటి' అని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. సింగరేణి

మిగతా 2 లో

### టెండర్లు రద్దు చేయడమంటే..
## అవినీతి జరిగినట్లే



- అసలు విషయాలు భట్టి ఎందుకు దాస్తున్నారు
- సీఎం రేవంత్ బావమరిది విషయంలోనూ దాపరికాలు
- ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు

### సింగరేణిపై శ్వేతపత్రం
## విడుదల చేయాలి



- కాంగ్రెస్, బిఆర్ఎస్ ఇద్దరూ దోపిడీ దారులే
- ఉమమడి ఎపిని మించి సింగరేణి గనుల దోపిడీ
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్



### అందరి బాగోతాలను
# బయటపెడతాం

## ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్లల్లో అక్రమాల గుర్తింపు

- త్వరలో 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్
- ధరణి పోర్టల్ లొసుగుల వల్లే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు
- జిల్లాల్లోని 35 మండలాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

3

### బండి,ధర్మపురిలకు కేటీఆర్
# లీగల్ నోటీసులు



పరువు తీసినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్

కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. తనపై, తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినందుకు సంజయ్, అర్వింద్‌లకు విడివిడిగా లీగల్ నోటీసులు జారీ చేశారు.

3



4

### అమెరికాను కుదిపేస్తున్న
## మంచు తుఫాన్

- ఎమర్జెన్సీ ప్రకటించిన పలు రాష్ట్రాలు
- 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు వెల్లడి



## యధాతథంగా టీహబ్ కార్యాలయం

### ప్రభుత్వ కార్యాలయాల మార్చవద్దన్న సీఎం

### అమెరికా నుంచి సీఎస్‌కు రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్,జనవరి24 :** టీహబ్‌ను స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ అంశంపై సీఎస్ రామకృష్ణారావుకు అమెరికా నుంచి ఫోన్ చేసి సీఎం మాట్లాడారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను టీహబ్‌కు మారుస్తున్నారనే వార్తలను ఖండించారు. టీహబ్‌లో ఇతర ఆఫీసులు ఉండకూడదని ఆదేశించారు. అలాంటి ఆలోచనలు అధికారులు విరమించుకోవాలన్నారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ ఆఫీసులను ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు. టీ హబ్ ను స్టార్టప్ కేంద్రంగా కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు.

## మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్‌లు

### మున్సిపాలిటీల వారీగా సమన్వయ కర్తల నియామకం

**హైదరాబాద్, జనవరి 24 :** పురపాలక ఎన్నికల కోసం బిఆర్ఎస్ ఇన్‌ఛార్జిలను నియమించింది. త్వరలో ఎన్నికలు జరగనున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా సమన్వయకర్తల జాబితాను ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విడుదల చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ను ఒక సీనియర్ నాయకుడికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాలను రూపొందించడం సమన్వయకర్తల ప్రధాన బాధ్యత అని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల పక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు నిరంతరం ఆయా మున్సిపాలిటీల్లో అందుబాటులో ఉంటారని చెప్పారు. ఎన్నికల్లో అత్యంత కీలకమైన అభ్యర్థుల ఎంపిక పక్రియలో ఇన్‌ఛార్జిలు కీలక పాత్ర పోషిస్తారన్న ఆయన... స్థానిక నాయకత్వంతో చర్చించి, గెలుపు గుర్రాలను గుర్తించి, నివేదికలను ఎప్పటికప్పుడు పార్టీ అధిష్ఠానానికి సమర్పిస్తారని పేర్కొన్నారు. పార్టీ రూపొందించిన ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడం, బూత్ లెవల్ ఏజెంట్లను సమన్వయం చేయడం వంటి అంశాలను పర్యవేక్షిస్తారని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల సరళి, క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదించేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## తెలంగాణ జాగృతి సింహ గర్జన

### స్థానిక ఎన్నికల బరిలో దిగేలా మాస్టర్ ప్లాన్

### ఫార్వర్డ్ బ్లాక్ సింహం గుర్తు పై పోటీ

**హైదరాబాద్, జనవరి 24 :** రాజకీయంగా బలపడడానికి అసవరమైన రీతిలో జాగృతి అధ్యక్షురాలు కవిత అడుగులు వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఇందుకు అవసరమైన విధంగా పునాదులు వేయాలని చూస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఎన్నికల్లో నిలబడాలన్న దిశగా వ్యూహం వేస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి నేతలు స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి దిగనున్నారు. మున్సిపాలిటీలతోపాటు జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లోనూ సింహం గుర్తుతో పోటీ చేయాలని తెలంగాణ జాగృతి నాయకత్వం నిర్ణయించింది. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సంప్రదింపులు పూర్తి చేసిన తెలంగాణ జాగృతి నాయకత్వం.. ఆ పార్టీకి చెందిన సింహం గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగాలని నిర్ణయించింది. ఇటీవల జరిగిన చర్చల్లో ఈ అంశంపై ఏఐఎఫ్‌బీ పార్టీ, తెలంగాణ జాగృతి మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇప్పటికే రాజకీయ పార్టీ రిజిస్ట్రేషన్ పక్రియలో వేగం పెంచారు. అయితే, పార్టీ రిజిస్ట్రేషన్ పూర్తి కావడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని అంచనా. ఈలోపు రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలతోపాటు జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లోనూ ఏఐఎఫ్‌బీ సింహం గుర్తుతో బరిలోకి దిగాలని జాగృతి నాయకత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ జాగృతి నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆమె వల్ల ప్రధానంగా నష్టపోయేది బిఆర్ఎస్ పార్టీయే. ఇది కాంగ్రెస్‌కు లాభించగలదు. అలాగే బిజెపికి కొంత దెబ్బతినగలదని అంటున్నారు.

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో హైదరాబాదీలు

### మయన్మార్-థాయి సరిహద్దుల్లో ముగ్గురు వ్యక్తులు

### వ్యవహారాన్ని విదేశాంగ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన అసద్

**హైదరాబాద్,జనవరి24 :** విదేశాల్లో మంచి ఉద్యోగం ఇప్పిస్తామన్న సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి, హైదరాబాద్ కు చెందిన ముగ్గురు యువకులు థాయ్‌ల్యాండ్–మయన్మార్ సరిహద్దులో చిక్కుకుపోయారు. యువకుల్లో ఒకరు ఉస్మాన్‌నగర్‌కు చెందిన వారు కాగా మరో ఇద్దరు మౌలాలీ, బంజారాహిల్స్‌లకు చెందిన వారు. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని నమ్మించిన సైబర్ ముఠా.. వీరిని 15 రోజుల క్రితం థాయ్‌లాండ్‌కు రప్పించుకుంది. అక్కడకు వెళ్లిన తర్వాత ఉద్యోగం ఇవ్వకుండా, మయన్మార్ సరిహద్దుల్లోని నిర్బంధ శిబిరాల్లో ఉంచి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. ఇదే విషయాన్ని బాధితులు తమ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాధితుల్లో ఓ యువకుని తల్లి రెండు రోజుల క్రితం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కలిసి తన కుమారుడిని రక్షించాలని వేడుకుంది. దీనిపై స్పందించిన ఎంపీ.. విషయాన్ని విదేశాంగ మంత్రి జయశంకర్ దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌తో పాటు దక్షిణ భారత దేశం నుంచి మొత్తం 16 మంది ఇలాగే సైబర్ మోసగాళ్లు చేతిలో మోసపోయి అక్కడే చిక్కుకున్నారని, వారందరనీ సురక్షితంగా భారత్‌కు రప్పించాలని కోరారు.

# నాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం

**ఫర్నిచర్ షాపులో చెలరేగిన మంటలు**

**పది గంటలకు పైగా పోలీస్, ఫైర్ సిబ్బంది ఆపరేషన్**

**8 ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నం**

**ఫైర్ రోబో ప్రవేశపెట్టినా ఫలితం శూన్యం**

**నలుదిక్కులా దట్టమైన పొగలతో సహాయక చర్యలకు ఆటంకం**

**లోపల ఆరుగురు చిక్కుకున్నట్టు గుర్తింపు**

**ప్రమాద కారణాలపై ఆరా తీస్తున్న అగ్నిమాపక దళం హెచ్‌ఎర్సీలో కేసు నమోదు**





**హైదరాబాద్ :** నాంపల్లిలోని ఓ ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పది గంటలకు పైగా ఫైర్, పోలీసులు, హైడ్రా సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు. 8 ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేస్తున్నారు. 2 కుటుంబాలకు చెందిన ఆరుగురు మంటల్లో చిక్కుకున్నారని, వారు బతికే అవకాశం లేదని అధికారులుచెప్తున్నారు. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలిగిందని తెలిపారు. ఫైర్ 30 రోబోను ప్రవేశపెట్టినప్పటికీ ఫలితం లేదన్నారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రమాదవశాత్తూ చోటు చేసుకున్న మంటలు... ఒక్కసారిగా ఏ వ్యాపించాయి. నాలుగు అంతస్తుల భవనం లోని గ్రౌండ్ ఫ్లోర్లో అగ్నిప్రమాదం జరిగింది. భవనం లోపల ఆరుగురు చిక్కుకున్నట్లు గుర్తించారు. వాచ్మెన్ కుటుంబంలో ఇద్దరు పిల్లలు, మరో కుటుంబంలోని నలుగురు పెద్దవారు చిక్కుకున్నట్లు తెలిసింది. చిక్కుకున్న ఇద్దరు చిన్నారులను అఖిల్ (7), ప్రణీత్ (11)గా గుర్తించారు. వీరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు భవనం పరిసర ప్రాంతవాసులను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతుండ డంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది... 8 ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తోం ది. మరోవైపు రోబో ఫైర్ మిషన్ ద్వారా రెస్క్యూ కొనసాగు తోంది. సెల్లార్ నిండా ఫర్నీచర్ ఉండటంతో సహాయక చర్యలకు ఇబ్బంది నెలకొంది. ఈ అపార్ట్ మెంట్ లో తల్లి, బిడ్డ సహా ఆరుగురు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వెంటనే భారీ క్రేన్ లతో విపత్తు నిర్వహణ అధికారులు రంగంలోకి దిగారు. స్కైలాడర్ ద్వారా నాలుగో అంతస్తు అద్దాలను పగులగొట్టి వారిని రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నాయి. అపార్ట్ మెంట్ చుట్టుపక్కల వారిని ఖాళీ చేయిస్తున్నారు. ఎనిమిది ఫైరింజన్ లతో మంటల్ని అదుపులోకి తీసుకుంటున్నారు.

### నుమాయిష్ బంద్...

నాంపల్లిలో నుమాయిష్ ఎగ్జిబిషన్ కొనసాగుతుండ డంతో వచ్చే సందర్శకులు, వాహనాల పార్కింగ్ తో సమస్య మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉండడంతో శనివారం నుమాయిష్ ను మూసి వేయాలని కలెక్టర్ హరిచందన దాసరి, సీపీ సజ్జనార్ లు అధికారులను ఆదేశించారు. నాంపల్లి పరిసర ప్రాంతాలకు వచ్చే వాహనాలను రూట్ మళ్ళించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో నాంపల్లి బచ్చాస్ సమీప ప్రాంతాలకు వచ్చే అత్యవసర వాహనాలు అంబు లెన్స్ అగ్నిమాపక వాహనాలు, డాక్టర్ల వాహనాలు, రెస్క్యూ టీమ్స్ బృందాలను మాత్రమే అనుమతించాలని పోలీసు అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్, హైదరాబాద్ సీపీ తో పాటు మేయర్ గద్వాల విజయలక్ష్మి, ట్రాఫిక్ అడిషనల్ సీపీ, ఫైర్ అధికారులు, హైడ్రా, రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధు లు పరిస్థితిని పర్యవేక్షించారు. అంతేకాకుండా ప్రమాదం చోటు చేసుకున్న భవనం సమీపంలో నివాసముంటున్న వారిని అధికారులు ఖాళీ చేయించారు. విద్యుత్ సరఫరాను సైతం నిలిపి వేశారు. దట్టమైన పొగల కారణంగా సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.



### చట్టపరమైన చర్యలు తీసుకుంటాం
### ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ మాన్

నాంపల్లి ఫర్నిచర్ షాప్ లో చోటు చేసుకుంది చాలా పెద్ద ప్రమాదమని ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ మాన్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. మంటల తీవ్రత అధికం గా ఉండడంతో అదుపు చేయడం చాలా కష్టంగా మారింద న్నారు. అయితే ప్రస్తుతానికి మంటల్ని అదుపులోకి తీసుకొచ్చామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లో స్టాక్ నింపడంతో మంటలు త్వరగా అదుపులోకి రాలేదన్నారు, బేస్ మెంట్ 1,2 లను పార్కింగ్ కోసమే ఉప యాగించాలని, అయితే ఇక్కడ నిబంధనలను పాటించ లేదన్నారు. అగ్నిమాపక సిబ్బందితో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా సహాయక చర్యలో పాల్గొం టున్నాయ న్నారు. లోనికి వెళ్ళడానికి మార్గం లేద ని, అయినా మేము డ్రిల్ల్ చేసి అన్ని బ్రేక్ చేసి వెళ్తున్నా మన్నారు. రెస్క్యూ ఆపరేషన్ పూర్తి అయ్యాక ప్రమాద ఘట న వివరాలు తెలుపుతామన్నారు. నిబంధనలు ఉ ల్లం ఘించి నవారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

### ప్రమాదానికి జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ నిర్లక్ష్యమే : హెచ్ఎర్సీలో కేసు నమోదు

నాంపల్లి లోని బాచా ఫర్నిచర్ అగ్నిప్రమాదంపై న్యాయ వాది రామారావు ఇమ్మానేని హెచ్ఆర్సీలో ఫిర్యాదు చేయడంతో హక్కుల కమిషన్ కేసు నమోదు చేసి దర్యాప్తుకు ఆదేశించింది. ఇది అగ్నిప్రమాదం కాదని, పరిపాలనా నిర్లక్ష్యమని ఆయన కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. అక్రమ కట్టడాలే అగ్నిప్రమాదానికి కారణమని, ఇది పూర్తిగా జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ నిర్లక్ష్యమంటూ, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన హక్కుల ను కోరారు.

# సింగరేణిపై కట్టుకథలు




మొదటి పేజీ తరువాయి

అటానమస్ సంస్థ అని, అన్ని నిర్ణయాలు వారే తీసుకుంటారని భట్టి తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రావడం, విచారణ జరిపించడాన్న స్వాగతిస్తున్నామని చెప్పారు. సింగరేణిలో తాను వచ్చాకే సైట్ విజిట్ నిబంధన వచ్చిందని ప్రచారం చేస్తున్నారని, నిజాలు బయటకు రావాలని, ప్రజలకు తెలియాలని చెప్పుకొచ్చారు. 2018లోనే సైట్ విజిట్ నిబంధనను కోల్ ఇండియా తీసుకొచ్చిందని, 2021లో ఎన్ఎమ్‌డీసీ కూడా అమలు చేసిందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 2023లో సింగరేణిలోనూ సైట్ విజిట్ కండీషన్ అమల్లోకి వచ్చిందని, సీఎమ్‌పీడీఐ డాక్యుమెంట్‌లో సైట్ విజిట్ తప్పనిసరని ఉందని చెప్పారు. 2018, 2021లో డిప్యూటీ సీఎం భట్టి లేదని, కాంగ్రెస్ లేదని ఆయన గుర్తు చేశారు. దేశంలోని పలు కేంద్ర, రాష్ట్ర సంస్థలు సైట్ విజిట్ అమలు చేస్తున్నాయన్నారు. రైల్వే, హిందుస్థాన్ కాపర్స్, గుజరాత్ ఇండస్ట్రీస్ పవర్ కంపెనీ, మహారాష్ట్ర ప్రభుత్వ టెండర్లలోనూ ఈ నిబంధన ఉందని భట్టి పేర్కొన్నారు. సైట్ విజిట్ ఎక్కడా లేదన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దురుద్దేశంతో రాసిన ఓ కథనం ఆధారంగా ఒక నేత లేఖ రాశారని, అపోహలు పెరుగుతాయని వెంటనే టెండర్లు రద్దు చేశామని భట్టి తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లకు బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిచారని, దేశంలో ఏ మైనింగ్ యాక్టివిటీలోనూ డీజిల్ సప్లయ్ చేసే పరిస్థితి లేదని చెప్పారు. 2022లో నైనీ బ్లాక్ టెండర్లలో డీజిల్ విధానం మార్చారని వెల్లడించారు. సింగరేణి 25 టెండర్లలో 20 బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 5 టెండర్లే జరిగాయని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటివరకు కాంగ్రెస్‌కు సంబంధించిన ఎవరికీ టెండర్లు రాలేదని అన్నారు. సృజన్‌రెడ్డితో సీఎంకు సంబంధాలున్నాయన్న వార్తల్లో నిజం లేదన్నారు. సృజన్‌రెడ్డి కంపెనీ శోధ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అని, ఎండీ దీప్తి రెడ్డి కందాల కూతురు అని, సృజన్‌రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అల్లుడని భట్టి వివరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు అసలు ఏం కావాలని, కేంద్రానికి ఎందుకు లేఖలు రాస్తున్నారని ఉ పముఖ్యమంత్రి ప్రశ్నించారు. 2014

నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని టెండర్లపై విచారణ జరపాలని తనకు లేఖ రాయాలన్నారు. తాడిచర్ల నుంచి నైనీ వరకు అన్నింటిపై దర్యాప్తు చేద్దామని అన్నారు. సీఎం రేవంత్ రాగానే చర్చించి విచారణకు ఆదేశిస్తామని చెప్పారు. తాను ఆస్తులు కూడబెట్టుకోవడానికి రాజకీయాల్లో రాలేదని, బొగ్గు బావుల్లో ఏ రాబందులను వాలనివ్వనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టులు జరిగితే.. 20 టెండర్లు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని మంత్రి వివరించారు. తెలంగాణ కు ఆత్మ సింగరేణి అని అన్నారు. అలాంటి సింగరేణిపై కట్టుకథలు.. కొన్ని లేఖలు.. కొన్ని రివ్యూ లు వచ్చాయని మండిపడ్డారు. 42 వేల మంది సింగరేణి ఉద్యోగుల.. ఔట్ సోర్సింగ్ ఉ ద్యోగులు 20 వేల మంది నీ మానసికంగా దెబ్బతీసేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా పెట్టుబడులు రాకుండా.. కట్టుకథల విషపు రాతలు.. తొలిపలుకు రాతలు.. తప్పుడు ప్రచారం.. రాష్ట్ర ప్రభుత్వం పై కావాలని కథనాలు రాస్తున్నారు. రోజుకో కథ వండి వారిస్తున్నారని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముఖ్యంగా సింగరేణికి సంబంధించిన ఆస్తుల్ని కాపాడాల్సినటువంటి వ్యక్తిగా వీటన్నింటిని చూస్తూ ఉంటే ఏ రాబందులు ఏ గద్దలు ఏ దోపిడి దారుల ప్రయోజనాల కోసమో ఈ కథనాలన్నీ వస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు. ఇటువంటి రాతలతో తెలంగాణకు సంబంధించినటువంటి అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ పైన నిందలు మోపే క్రమంలో ఈ రాష్ట్రానికి సింగరేణికి నష్టం చేస్తున్నారన్న సంగతి మర్చిపోవద్దని గుర్తు చేశారు. సింగరేణి నిర్ణయం మంత్రుల దగ్గరికి రాదు.. అటానమస్ సంస్థ ఇది. మంత్రి మండలి దగ్గరకు కూడా రాదు.. ఇంగితం ఉన్న.. విజ్ఞానం ఉన్న వారు ఇలా రాయరు అని తెలిపారు. పారదర్శకంగా ఉండాలి అనుకోవడమే కాదు.. పారదర్శకంగా ఉండాలి అని వెంటనే టెండర్ రద్దు చేయాలి అని చెప్పానని అన్నారు. హరీష్ లేఖ రాయడం.. కిషన్ రెడ్డి విచారణ చేపట్టడం.. మంచిది అయ్యిందన్నారు. కిషన్ రెడ్డి చర్యలను స్వాగతిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం.. అడ్డగోలుగా ప్రచారం చేసే వాళ్ల బతుకు బయట పడాలని అనుకున్నానని అన్నారు.గత డాక్యుమెంట్ల ఆధారంగానే సింగరేణి టెండర్లు పిలిచింది.. నిజం ఇలా ఉంటే.. భట్టి విక్రమార్క చేసినట్టుగా కథనాన్ని వండి వార్చారని మండిపడ్డారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
ఆదివారం 25 జనవరి 2026


# అందరి బాగోతాలను బయటపెడతాం

**ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్లల్లో అక్రమాల గుర్తింపు**

**త్వరలో 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్**

**ధరణి పోర్టల్ లొసుగుల వల్లే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు**

**జిల్లాల్లోని 35 మండలాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు**

**ధరణి పోర్టల్ అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీ నివేదిక**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**



**హైదరాబాద్,జనవరి24 :** ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కొల్లగొట్టినవారిని, రిజిస్ట్రేషన్‌ల చలానా సొమ్మును కాజేసినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంలోని పెద్దలు ప్రభుత్వ భూములను కాజేశారని, దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడం జరిగిందని ఇందులో అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రాధమిక నివేదికలో స్పష్టమైందని ఆయన తెలిపారు. ఈ ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన సంఘటనలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. విచారణలో ఎదురైన అంశాలు,ఎవరి పాత్ర ఎంత? తెరవెనుక ఎవరైనా ఉన్నారా? రెవెన్యూ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ ప్రాధమిక నివేదికను పరిశీలించి మరికొన్ని సలహాలు సూచనలు చేస్తూ మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదికను సమర్పించాలని సూచించారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటినుంచి 35వేల లావాదేవీలు జరిగాయని ఇందులో ప్రాధమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు గుర్తించడం జరిగిందని అయితే విచారణ తర్వాత 1109 డాక్యుమెంట్లకు సంబంధించి సుమారు నాలుగు కోట్ల రూపాయిలు ప్రభుత్వానికి చెల్లింపు జరగలేదని కమిటీ సభ్యులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం అనాలోచితంగా ఎలాంటి ముందుచూపు లేకుండా ఒక కుట్రపూరితంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమాలకు పాల్పడితే భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి అక్రమాలను గుర్తించి తక్షణమే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. ఇందుకు సంబంధించి తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రతిపక్షంలో ఉన్న ఓ నాయకుడు వెయ్యి కోట్ల అవినీతి అని, మరో నాయకుడు పదివేల కోట్లు అని ఇంకొక్కరు భూభారతి పోర్టల్ అవినీతిమయమని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇదిలావుంటే ఇప్పటికే మొదటి విడతలో నాలుగు వేల మంది శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌లు జారీ చేయగా ఆదివారం నాడు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో మరో రెండు వేల మందికి లైసెన్స్‌లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రాష్ట్రంలో నక్షా లేని 373 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇంటిలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్ ,ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు డిఐజీ ఎమ్. సుభాషిని, సిఎమ్ఆర్‌వో మకరంద్, ఏసీబీ ఎస్పీ సింధు శర్మ, సైబర్ క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, ఎన్ఐసి ప్రతినిధి శ్రీనివాస్ , హోంశాఖ సలహాదారు పి. శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బండి,ధర్మపురిలకు కేటీఆర్ లీగల్ నోటీసులు

**పరువు తీసినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్**

హైదరాబాద్ : కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. తనపై, తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినందుకు సంజయ్, అర్వింద్‌లకు విడివిడిగా లీగల్ నోటీసులు జారీ చేశారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అడ్డగోలుగా మాట్లాడిన వీరు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా కేవలం దురుద్దేశం పూర్వకంగా, రాజకీయాల కోసం దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు బండి సంజయ్, అర్వింద్‌లకు కేటీఆర్ తన న్యాయవాదులతో నోటీసులు పంపించారు. కేటీఆర్ కుటుంబం ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు సంపాదించిందని, సెలబ్రిటీల ఫోన్లు ట్యాప్ చేశారంటూ ఈనెల 23న నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే బండి సంజయ్‌పై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా నడుస్తున్నప్పటికీ, మళ్లీ అదే తరహాలో తప్పుడు ఆరోపణలు చేయడం దురుద్దేశపూర్వకమని మండిపడ్డారు. మరోవైపు ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు పంపిన నోటీసులో ఆయన చేసిన వ్యక్తిగత దూషణలను తప్పుబట్టారు. డ్రగ్స్ సేవించడం, సరఫరా చేస్తున్నారంటూ అర్వింద్ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని పేర్కొన్నారు.

# నైనీ బ్లాక్ టెండర్లపై విచారణ

**రంగంలోకి దిగిన ఇద్దరు కేంద్ర బృందం సభ్యులు**

**హైదరాబాద్ :** నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వివాదంపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యుల సాంకేతిక కమిటీ సింగరేణి భవనానికి చేరుకుని విచారణను ప్రారంభించింది. సీఎస్ఆర్ నిధుల వినియోగం, టెండర్ నిబంధనలు వంటి అంశాలపై కేంద్ర బృందం ఆరా తీస్తోంది. సింగరేణి సీఎండీ కృష్ణ భాస్కర్ వద్ద ఈ బృందం వివరాలు సేకరిస్తోంది. శుక్రవారం రాత్రి 7 గంటలపాటు విచారణ జరిపింది. నేడు మరోసారి విచారణ చేపట్టిన బృందం వచ్చే సోమవారం తన నివేదికను కేంద్రానికి సమర్పించనుంది. కాగా.. నైనీ బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్‌లో సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధన సరికాదని, అక్రమాలకు దారి తీస్తుందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో టెండర్లను రద్దు చేయాలని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించిన విషయం తెలిసిందే. అలాగే నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లలో అవినీతి ఆరోపణలపై స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. సమగ్ర విచారణకు సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందంతో కమిటీ ఏర్పాటైంది. బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, బొగ్గు శాఖ టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం సింగరేణిలో పర్యటించి.. నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై విచారణ జరిపి, ఆ నివేదికను మూడు రోజుల్లో అందజేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

# సింగరేణిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**కాంగ్రెస్, బిఆర్ఎస్ ఇద్దరూ దోపిడీ దారులే**

**ఉమమడి ఏపిని మించి సింగరేణి గనుల దోపిడీ**

**మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్,జనవరి24 :** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నాయని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని ఆరోపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన.. మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. 2014 నుంచి ఇప్పటివరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే.. గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే.. బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెబుతున్నారని ప్రస్తావించారు. సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని ఆరోపించారు. సింగరేణిపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో టైంపాస్ చేయొద్దని బండి అన్నారు. సింగరేణి అవకతవకలకు సంబంధించిన రికార్డులన్నీ వెంటనే సీజ్ చేయాలని కోరారు. లేనిపక్షంలో అవి తారుమారు చేసే ప్రమాదముందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని బండి సంజయ్ విమర్శించారు. ఆ సొమ్ముతోనే బీఆర్ఎస్‌ను ఇన్నాళ్లూ నడిపించారని ఆరోపించారు. 'రూ.42 వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంది. సింగరేణిని అప్పుల పాల్జేసింది. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మునంతా దారి మళ్లించడం పరిపాటైంది. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలే. మా బాగోతం మీరు బయటపెడితే.. మీ బాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారు. మరో వారం రోజుల తర్వాత సింగరేణి బాగోతాన్ని దారి మళ్లించేందుకు మరో అంశాన్ని తెరపైకి తెస్తారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మేయర్, మున్సిపల్ ఛైర్మన్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుంది' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను సాక్షిగా పిలిచామని మంత్రులు చెబుతున్నారు. విచారణకు పిలిచామని సీపీ సజ్జనార్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్, కేసీఆర్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం క్లీన్ చిట్ ఇస్తోందా? కేటీఆర్, హరీశ్‌రావులతో సహా అందరినీ సాక్షిగా పిలిస్తే.. అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరు? ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటి? సిట్ విచారణను ప్రత్యక్షంగా, పరోక్షంగా మంత్రులు ప్రభావితం చేసినట్లే. ఇప్పటికైనా సిట్‌కు స్వేచ్ఛనివ్వాలి. ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న క్రెడిబిలిటీ పోతుంది. ప్రజలను దోచుకున్న కేసులన్నీ కేసీఆర్ కుటుంబానికి లొట్టపీసు కేసుల్లాగే కనిపిస్తాయి. ఎన్ని అరాచకాలు, అవినీతి చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదనే ధీమా కేసీఆర్

కుటుంబంలో ఉందని విమర్శించారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో నన్ను విచారణకు పిలిచి నా ఫోన్ ట్యాప్ అయ్యిందని, మావోయిస్టు జాబితాలో నా పేరును చేర్చారని చెప్పారు. మరి అందుకు కారకులైన వారిపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు?. కాంగ్రెస్ స్కాంలు బయటపడుతున్నప్పుడల్లా ఫోన్ ట్యాపింగ్ కేసుతో డ్రామాలాడుతున్నారు. కేటీఆర్ పెద్ద నిజాయతీపరుడిలా మాట్లాడుతున్నారు. ఎన్ని కుటుంబాలను, ఎంత మంది జీవితాలను నాశనం చేశారో తెలియదా? నిజామ్ అరాచకాలను మరువలేదు.. నీ అరాచకాలను కూడా మర్చిపోలేం. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదు. ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్.. నా ఛాలెంజ్‌కు సిద్ధమా? దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే దమ్ముందా? మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతో పాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నంబర్లను చేర్చింది నిజం కాదా? ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా? ఇంకా సిగ్గులేకుండా దేశ భద్రత కోసం ఫోన్ ట్యాపింగ్ చేశామని చెబుతారా? నేను సవాల్ విసిరితే లీగల్ నోటీసులంటూ డ్రామాలాడతారు. పోనీ ఆ లీగల్ నోటీసులకైనా కట్టుబడి ముందుకు సాగుతారా? అంటే.. మధ్యలోనే పారిపోతారు' అని కేంద్ర మంత్రి ఎద్దేవా చేశారు. 'రోహింగ్యాలు 2014కు ముందే పాతబస్తీలోకి అక్రమంగా ప్రవేశించారు. వారికి రేషన్ కార్డులు, ఓటర్ కార్డులిచ్చింది కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులే. బీఆర్ఎస్ పాలనలో నాటి హోంమంత్రి.. వారికి ఇళ్లు మంజూరు చేసి మద్దతిచ్చారు. రాష్ట్ర పాలకులే ఓటు బ్యాంకు కోసం రోహింగ్యాలకు వంతపాడుతుంటే.. శాంతిభద్రతలను కాపాడేదెవరని బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు.

# టెండర్లు రద్దు చేయడమంటే.. అవినీతి జరిగినట్లే

**అసలు విషయాలు భట్టి ఎందుకు దాస్తున్నారు**

**సీఎం రేవంత్ బావమరిది విషయంలోనూ దాపరికాలు**

**ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు**



**హైదరాబాద్,జనవరి24 :** బొగ్గు కుంభకోణం విషయంలో అవినీతి ఆరోపణలు రావడంతో నైనీ టెండర్ రద్దు చేశారంటే, స్కాం జరిగినట్లేనని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు.నైనీ వ్యవహారంలో మంత్రి భట్టి మసిబూసి మారేడు కాయ చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో సోలార్ స్కాం చేసిన ఆరోపణలపై మౌనం ఎందుకు వహిస్తున్నారని ఆరోపించారు. శనివారం హరీష్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ రెడ్డి బావమరిది కోసమే ఈ తతంగమంతానని విమర్శించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక, విషయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నైనీ టెండర్ రద్దు చేయడమే అవినీతికి నిదర్శనమని, అదే తరహాలో పిలిచిన మిగిలిన టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా బీటింగ్ అరౌండ్ ద బుష్ లా ఏదో చెప్పి, మసిబూసి మారేడు కాయ చేసారు. మీరెన్ని సాకులు చెప్పినా మీ కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది నిజం. అందులో రేవంత్ రెడ్డి బామ్మర్ది రింగ్ మెన్ గా పాత్ర పోషించింది నిజం. నేను సూటిగా అడుగుతున్నా. ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎందుకు ప్రకటించారు? నిన్న బయటపెట్టిన మరో కుంభకోణం.. సోలార్ పవర్ స్కాం గురించి ఎందుకు ఒక్క మాట కూడా ప్రెస్ మీట్ లో మాట్లాడలేదని నిలదీశారు. నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదు? సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను బిఆర్ఎస్ మీద నెట్టే ప్రయత్నం చేయడం వల్ల నిజాలు అబద్దాలు అయిపోవు. జరిగిన స్కాంలు, స్కీంలుగా మారిపోవని స్పష్టం చేశారు. సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని చెప్పి, దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారు? అది తప్పు కాకుంటే నైనీ ఎందుకు రద్దు చేసినట్లు? ఇదే సైట్ విజిట్ విధానం సింగరేణిలో కూడా అమలు చేసామని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు ధన్యవాదాలని అన్నారు. భట్టి గారూ. మీరంటే నాకు చాలా గౌరవం. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ మాత్రమే చేయగలవు అన్న ఉద్దేశ్యంతోనే లేఖ రాసాను. మీరు నిజంగా రేవంత్ రెడ్డి, అతని బావమరిది కుంభకోణం మీద నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తాను అని హామీ ఇస్తే మీకూ లేఖ రాయడానికి సిద్దమని హరీష్‌రావు స్పష్టం చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ దోషులను వదిలేది లేదు

**కెసిఆర్ ప్రభుత్వం ఏం చేసినా చూస్తూ ఊరుకోవాలా**

**సూత్రధారులను, పాత్రధారులను బయటకు లాగుతాం**

**మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టీకరణ**

**హైదరాబాద్,జనవరి24 :** ఫోన్‌ట్యాపింగ్ కేసులో దోషులను కఠినంగా శిక్షపడేలా చూస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎవ్వరినీ వదిలి పెట్టమని స్పష్టంచేశారు. ఫోన్‌ట్యాపింగ్ అనేది చాలా దుర్మార్గమని.. దానిని రాజకీయ కక్ష్య అని అనడం సరికాదని ఆయన అన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో దర్యాప్తు జరుగుతుందని స్పష్టం చేశారు. ఫోన్‌ట్యాపింగ్ లో పాత్రధారులెవరో, సూత్రధారులెవరో తెలియాల్సి ఉందన్న మంత్రి.. దీనిని దిగజారుడు తనమే అంటారని చెప్పుకొచ్చారు. ప్రజాధనంతో నడిచేది విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ అని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏం చేసినా చూస్తూ ఊరుకోవాలా? దర్యాప్తు జరిపించవద్దా.? అని ప్రశ్నించారు. ఫోన్‌ట్యాపింగ్ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తామని మంత్రి జూపల్లి తెలిపారు. ఫోన్.. ట్యాపింగ్ అవుతుందని వి.ప్రకాశ్ అనే వ్యక్తి ఆరోజే చెప్పారని ప్రస్తావించారు. ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ కూడా ఫోన్‌ట్యాపింగ్ అయిందని గతంలో మాట్లాడారని గుర్తుచేశారు. ఐఏఎస్ అధికారులు ఆకునూరి మురళి సైతం ఈ అంశం గురించి మాట్లాడారని చెప్పుకొచ్చారు. మాజీ గవర్నర్ తమిళసై ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందని చెప్పారని ప్రస్తావించారు. మాజీ మంత్రి కేటీఆర్ సహా మరి కొందరి ఫోన్లు ట్యాపింగ్ అయ్యుండొచ్చని ఒప్పుకున్నారని జూపల్లి అన్నారు. తెలంగాణ రాష్టం ఏర్పాటు చేసుకున్నది ప్రజల సమస్యలు పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు. కెటీఆర్‌కు 160 సీఆర్పీసీ కింద మాత్రమే నోటీసులు ఇచ్చారని.. నేరస్థులుగా పరిగణించలేదని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. సాక్షిగా సమాచారం కోసమే పోలీసులు కేటీఆర్‌ను విచారణకు పిలిచారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో పాటు కీలక పాత్ర పోషించిన కోదండరామ్‌నూ గతంలో అక్రమంగా అరెస్ట్ చేశారని వెల్లడించారు. చట్టం ప్రకారం నోటీసులిచ్చి పోలీసులు విచారిస్తారని చెప్పారు. ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు.. అమెరికాకు ఎందుకు వెళ్లిపోయారని నిలదీశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు అమెరికా నుంచి ఇండియాకు వచ్చారని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు రావడానికి చాలా కారణాలున్నాయని చెప్పారు. పార్టీలకు అతీతంగా అందరూ విచారణకు వచ్చారని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

## వేధింపులను తప్పుపడితే నోటీసులా

**ప్రజా సమస్యలు, దౌర్జన్యాలపై గొంతెత్తుతూనే ఉంటా**

**సిట్ పోలీసుల నోటీసులపై మాజీ ఐపిఎస్ ప్రవీణ్ కుమార్**

**హైదరాబాద్,జనవరి24 :** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీష్‌రావులను గంటల తరబడి దర్యాప్తు పేరిట వేధించడాన్ని తప్పుబడితే తనకు సిట్ నోటీసులు అందించడంపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ భవన్ లో మీడియా సమావేశంలో ఖండించిన 12 గంటల లోపే రాత్రి 12 గంటలకు ఇంటికి వచ్చి సిట్ పోలీసులు నోటీసులు ఇచ్చి రెండు రోజుల్లో ఆధారాలతో సహా రిప్లై ఇవ్వకపోతే సివిల్, క్రిమినల్ చర్యలకు సిద్ధం కావాలని వార్నింగ్ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, దౌర్జన్యాలపై గొంతెత్తడం నా హక్కు అని వెల్లడించారు. పోలీసుల వార్నింగ్‌లకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ కూడా వ్యక్తిగత దూషణలు , చిల్లర భాషను వాడనని, అదేవిధంగా వాస్తవాలు దాచనని తెలిపారు. దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం కూడా ఆపనని వెల్లడించారు.రేవంత్ రెడ్డి ట్యాపింగ్ జరగడం మామూలే అని ఢిల్లీలో చెప్పినట్లుగా కూడా వార్తలున్నాయి. అలాంటప్పుడు సిట్ దర్యాప్తు ఎందుకు? అని ప్రశ్నించారు. సిట్ ఛీఫ్ సజ్జనార్‌పై ఆంధ్ర ప్రదేశ్ లో నమోదైన కేసుల మీద మరో సిట్ వేయాలి అని డిమాండ్ చేసినట్లుగా నోటీసులో ఉందని , ఇది వాస్తవ విరుద్ధమని అన్నారు. ఓటుకు నోటు కేసులో లైవ్ కెమెరాలో నాటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి అడ్డంగా దొరికిన తరు వాత, ఆంధ్ర ప్రదేశ్ నాయకుల ఫోన్లు తెలంగాణ ప్రభుత్వం, ఇంటలిజెన్స్ అధికారులు ట్యాప్ చేశారని 2015 జూన్ నెలలో ఆంధ్రలో అనేక పోలీసు స్టేషన్లలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పై కేసులు నమోదయ్యాయని పత్రికల్లో చాలా వార్తలొచ్చాయి. ఆ సమయంలో ఆంధ్రలో కూడా ఒక సిట్ కూడా ఏర్పాటు అయ్యింది. నాడు తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం లో అధికారిగా సీపీ సజ్జనార్ పనిచేశారు అన్న అవగాహన తనకుందని అన్నారు. ప్రస్తుత ట్యాపింగ్ వ్యవహారం పై వేసిన రెండో తెలంగాణ సిట్‌కు ఛీఫ్ గా ఉండడం నైతికంగా కరెక్టు కాదని అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా మరుగున పడిన విషయాలను ప్రజల ముం దుకు తీసుకరావాల్సిన కనీస బాధ్యత తనపై ఉందన్నారు. ఈ విషయం మీ కు నచ్చకపోతే వివరణ ఇవ్వాలని సూచించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న పలు కుంభకోణాల మీద సిట్ వేయాలని డిమాండ్ చేశానని వివరించారు. తాను సజ్జనార్‌తో సహా ఏ అధికారి, ఏ రాజకీయ నాయకుడి వ్యక్తిత్వ హననానికి పాల్పడలేదని వెల్లడించారు.

# 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

## 27న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని పరభుత్వం ఈనెల 27న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాలకు ముందు సంప్రదాయం ప్రకారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న ట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 27వ తేదీన పార్లమెంట్‌లోని మెయిన్ కమిటీ రూమ్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో చేపట్టనున్న లెజిస్లేటివ్, ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. జనవరి 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించడంతో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. జనవరి 28తో ప్రారంభమయ్యే తొలి విడత బ్జడెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. రెండో విడత బ్జడెట్ సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తాయి. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంనాడు కేంద్ర బ్జడెట్ 2026-27ను ఉభయసభల్లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. సీతారామన్ వరుసగా ప్రవేశపెడుతున్న తొమ్మిదవ బ్జడెట్ ఇది. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకూ రాష్ట్రపతి బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఉంటుంది. దీనితో పాటు వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు-2025, ది సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్-2025, రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు-2024పై సభలో చర్చ ఉంటుంది. ఈ బిల్లులను తదుపరి పరిశీలన కోసం పార్లమెంటరీ స్థాయీ సంఘానికి లేదా సెలెక్ట్ కమిటీలకు పంపనున్నారు. కాగా, గత శీతాకాల సమావేశాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(గ్రామీణ్) చట్టంపైనా పార్లమెంటులో చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం చేసిన ఈ మార్పుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించడంతో పాటు కొత్త చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రచారం సాగిస్తోంది.

# ఆపరేషన్ సిందూర్‌పై రాజీ లేదు

## ఈ విషయంలో నా అభిప్రాయాలు నాకున్నాయి

## కాంగ్రెస్‌తో విభేదాలపై ఎంపీ శశిథరూర్



**న్యూఢిల్లీ :** పార్లమెంటులో పార్టీ నియమావళిని తాను ఎప్పుడూ ఉల్లంఘించలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ అన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విషయంలోనే తనకు పార్టీతో అభిప్రాయ-భేదాలున్నట్టు చెప్పారు. అయితే ఈ విషయంలో తాను క్షమాపణ కోరనని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్‌ను భారత్ చేపట్టింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఎండగట్టేందుకు విదేశాలకు వెళ్లిన కేంద్ర ప్రతినిధి బృందంలో శశిథరూర్ ఉండటం సొంత పార్టీ నుంచి విమర్శలకు దారితీసింది. కేరళ లిటరేచర్ ఫెస్టివల్ సందర్భంగా మీడియా అడిగిన ఒక ప్రశ్నకు శశిథరూర్ స్పందిస్తూ, ఆపరేషన్ సిందూర్ అంశలో తాను ఒక బలమైన నిర్ణయం తీసుకున్నానని, దానికి కట్టుబడి ఉన్నానని, దానిపై తాను క్షమాపణ కోరనని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు తాను రాసిన ఆర్టికల్‌ను థరూర్‌ను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఒక రచయితగా పహల్గాం గురించి తాను ఆర్టికల్ రాశానని, ఉగ్రదాడులకు తగిన సైనిక స్పందన ఉండాలని అందులో చెప్పానని, అభివృద్ధిపై దృష్టిసారించిన భారత్ దీర్ఘకాల ఘర్షణలకు వెళ్లకుండా ఉగ్రవాద శిబిరాలను టా÷-గ్గ్ం÷ట్ చేయాలని అందులో పేర్కొన్నానని చెప్పారు. తాను ఏదైతో అభిప్రాయపడ్డానో అదేవిధంగా పాక్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేయడం తనకు ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. పార్టీ అధినాయకత్వంతో థరూర్‌కు విభేదాలున్నాయని, రాహుల్ గాంధీ ఇటీవల కొచ్చి వెళ్లినప్పుడు ఆయనకు ప్రాధాన్యత ఇవ్వలేదని, రాష్ట్ర నాయకులు సైతం థరూర్‌ను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఇటీవల ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలపై థరూర్ సైతం అసంతృప్తితో ఉన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికలపై ఆ రాష్ట్ర నాయకులతో ఏఐసీసీ అధిష్ఠానం శుక్రవారంనాడు సమావేశమైంది. దీనికి కూడా శశిథరూర్ గైర్హాజరయ్యారు. పార్టీకి థరూర్ అవసరం ఇంకెంతమాత్రం లేదంటూ సందీప్ దీక్షిత్ సహా పలువురు పార్టీ నేతలు దీనిపై వ్యాఖ్యానించారు. శశిథరూర్ గైర్హాజరు వెనుక పార్టీతో విభేదాలే కారణమని ఊహాగానాలు సైతం వెలువడ్డాయి. దీనిపై తాజాగా శశిథరూర్ స్పందించారు. పార్టీ అంతర్గతం వ్యవహారాలపై బహిరంగంగా మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయ డిక్లరేషన్ చేసేందుకు తాను ఇక్కడికి రాలేదని, ఇది లిటరరీ ఫెస్టివల్ అని అన్నారు. పార్టీ నాయకత్వంతోనే ఈ విషయం ప్రస్తావించగలనని, బహిరంగ వేదికలమీద కాదని చెప్పారు. సమవేశంలో పాల్గొనే విషయంలో తన అసక్తతను తెలియజేస్తూ పార్టీకి ముందస్తు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు.

# అమెరికాలో దారుణ ఘటన

## కుటుంబ తగాదాలతో నరమేథం

## భారత సంతతి వ్యక్తి కాల్పుల్లో భార్య మరో ముగ్గురు హతం

**న్యూయార్క్ :** అమెరికాలో భారత సంతతికి చెందిన నలుగురు వ్యక్తులు హత్యకు గురయ్యారు. కుటుంబ తగాదాల వల్ల ఓ వ్యక్తి తన భార్యతో పాటు బంధువులను కాల్చి చంపాడు. జార్జియాలోని లారెన్స్‌విల్లే నగరంలో అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటనకు సంబంధించి విజయ్ కుమార్ (51)ను పోలీసులు అరెస్టు చేశారు. మీడియా కథనాల ప్రకారం.. కాల్పుల విషయం పోలీసులకు ఫోన్‌కాల్ ద్వారా సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా.. అక్కడ నలుగురు భారత సంతతి వ్యక్తులు విగత జీవులుగా పడి ఉండటాన్ని గుర్తించారు. కుటుంబ తగాదాల వల్లే విజయ్‌కుమార్ వారిని కాల్చి చంపాడని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. మృతులను కుమార్ భార్య మీను డోగ్రా (43), బంధువులు గౌరవ్ కుమార్ (33), నిధి చందర్ (33), హరీష్ చందర్(38)గా గుర్తించారు. కాల్పుల సమయంలో ఇంట్లో ముగ్గురు పిల్లలు ఉన్నారని, ఆత్మరక్షణ కోసం వారు ఒక గదిలో దాక్కున్నారని పోలీసులు తెలిపారు. వారిలో ఒకరు తమకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతోనే.. విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. పిల్లలను సురక్షితంగా వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఇక, ఈ ఘటనపై అట్లాంటాలోని భారత కాన్సులేట్ జనరల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. నిందితుడు అరెస్టయ్యాడని.. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొంది.

# భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది






**దేశవ్యాప్తంగా 18వ రోజ్‌గార్ మేళా**

**ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి**

**యువతకు అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్న మోదీ**

**వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి**

**61,000 మందికి నియామక పత్రాలు అందించిన మోడీ**

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా శనివారం జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా 45 కేంద్రాల నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మొత్తం నియామకాల్లో 49,200.. హోంమంత్రిత్వ శాఖ, పారామిలిటరీ దళాలకు సంబంధించినవని తెలిపారు. మహిళా కానిస్టేబుల్స్ భారీగా నియమితులవు తున్నారని, గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక సౌలభ్య చర్యలు తీసుకున్నందు వల్ల ఇది సాధ్యమైందని వివరించారు. బీఎస్ఎఫ్ మహిళా దళాలు సరిహద్దుల్లో జీరో లైన్ వద్ద ఉద్యోగాలు చేస్తున్నాయని, రిపబ్లిక్ డే పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ పురుష దళానికి మహిళా అసిస్టెంట్ కమాండెంట్ నాయకత్వం వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ మేళాల ద్వారా ఇప్పటివరకూ 11 లక్షలకు పైగా నియామక పత్రాలు విడుదల చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు.. హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య విభాగాలతోపాటు ఇతర శాఖల్లో ఈ నియామకాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు.

# అమెరికాను కుదిపేస్తున్న మంచు తుఫాన్

## ఎమర్జెన్సీ ప్రకటించిన పలు రాష్ట్రాలు.. 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు వెల్లడి



**వాషింగ్టన్ :** అమెరికాను భారీ మంచు తుపాను తాకింది. దీంతో పలు రాష్ట్రాల్లో భారీస్థాయిలో మంచు, వర్షంతోపాటు అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం టెక్సాస్, ఓక్లహోమాపై మంచు తుపాను పంజా విసురుతోంది. మంచు తుపాను కారణంగా అమెరికాలోని 20 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రభావితం కానున్నట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఈ భీకర తుపాను కారణంగా పలు రాష్ట్రాల్లో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. శనివారం నాటి 3,200 విమాన సర్వీసులు, ఆదివారం నాటి 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు సైలట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది. ముమ్ముందు ఈ పరిస్థితి మరింత తీవ్రతరమయ్యే అవకాశం ఉండడంతో పెద్దసంఖ్యలో రవాణా సర్వీసులకు అంతరాయం కలగొచ్చని అంచనా వేసింది. వాతావరణ హెచ్చరికలతో అమెరికాలోని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. కెంటకీ, వర్జీనియా, కాన్సస్, ఆర్కాన్సాస్, జార్జియా, మిసిసిపి సహా పలు రాష్ట్రాలు ఎమర్జెన్సీ విధించాయి. మిసిసిపి, ఫ్లోరిడా వంటి దక్షిణాది రాష్ట్రాల్లోనూ ప్రమాదకర చలి వాతావరణం ఉంటుందని.. మిస్సోరి, ఇల్లినోయీలలోనూ భారీ మంచు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

ప్రతికూల వాతావరణం కారణంగా అనేక ప్రాంతాల్లో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడనుందని, వాహనదారులు మంచులోనే చిక్కుకుపోయే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఇది ఈ దశాబ్దిలోనే అతి తీవ్రమైనదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# బారాముల్లా ఎంపీకి కస్టడీ పెరోల్


## పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల కోసం మంజూరు

**న్యూఢిల్లీ :** బారాముల్లా ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజినీర్ రషీద్ కు పార్లమెంటు బ్జడెట్ సమావేశాల నేపథ్యంలో కస్టడీ పెరోల్ మంజూరైంది. ఉగ్రనిధుల కేసులో నిందితుడైన రషీద్ ప్రస్తుతం ఢిల్లీలోని తిహాడ్ జైలులో ఉన్నారు. జనవరి 28 నుంచి ప్రారంభమవుతున్న పార్లమెంటు బ్జడెట్ సమావేశాలకు హాజరయ్యేందుకు ఆయనకు అనుమతిస్తూ ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు కస్టడీ పెరోల్ మంజూరు చేసింది. పార్లమెంటు సమావేశాల్లో హాజరయ్యేందుకు తాత్కాలిక బెయిల్ కానీ, కస్టడీ పెరోల్ కానీ ఇవ్వాలని రషీద్ ఇటీవల కోర్టును కోరారు. దీనిపై సమాధానం ఇవ్వాలని ఎన్ఐఏకు గతవారం ప్రత్యేక ఎన్ఐఏ జడ్జి ప్రశాంత్ శర్మ నోటీసులు జారీచేశారు. కోర్టు తాజా ఆదేశాలపై రషీద్ తరఫు న్యాయవాది నిషిత గుప్తా మాట్లాడుతూ, బ్జడెట్ సమావేశాలు జరిగే జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకూ అన్ని రోజులూ హాజరయ్యేందుకు కోర్టు అనుమతించిందని చెప్పారు. పార్లమెంటు సెక్యూరిటీతో పాటు పోలీసు సెక్యూరిటీతో ఈ సమావేశాలకు రషీద్ హాజరవుతారని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రనిధుల కేసుకు సంబంధించి 2019లో రషీద్‌ను అరెస్టు చేశారు. విచారణలో ఉండగానే ఆయన 2024 లోక్‌సభ ఎన్నికల్లో బారాముల్లా నియోజకవర్గం నుంచి పోటీ చేసి నేషనల్ కాన్ఫరెన్స్ నేత, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాపై 2 లక్షల పైచిలుకు ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. కాగా, రెండు విడతల బ్జడెట్ సమావేశాల్లో భాగంగా తొలివిడత జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకూ జరుగుతుంది. తిరిగి మార్చి 9న ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తుంది. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంనాడు పార్లమెంటులో బ్జడెట్ సమర్పణ జరుగుతుంది.

# చైనాకు బలైపోతావ్ జాగ్రత్త!

## కెనడాను హెచ్చరించిన ట్రంప్

**వాషింగ్టన్ :** మిసైల్ రక్షణ వ్యవస్థ గోల్డెన్న్ డోమ్ ఏర్పాటు ప్రతిపాదనలను కెనడా వ్యతిరేకిస్తుండటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదో ఒక రోజు కెనడా చైనాకు బలైపోతుందని వ్యాఖ్యానించారు. చైనాతో దౌత్య, వాణిజ్య బంధాల బలోపేతానికి కెనడా ప్రయత్నిస్తున్న తరుణంలో ట్రంప్ ఈ హెచ్చరిక చేయడం గమనార్హం. గ్రీన్‌లాండ్‌కు రక్షణగా గోల్డెన్ డోమ్ ఏర్పాటును కెనడా వ్యతిరేకిస్తోంది. కెనడాకూ ఈ వ్యవస్థతో రక్షణ లభించే అవకాశం ఉన్నా అడ్డుకుంటోంది. ఇది చాలదన్నట్టు వారు చైనాతో వాణిజ్యానికి మొగ్గుచూపుతున్నారు. ఒప్పందం కుదిరిన మొదటి సంవత్సరం లోనే వారు చైనాకు ఆహారమైపోతారని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా ట్రంప్ హెచ్చరించారు. అమెరికా భద్రతకు గ్రీన్‌లాండ్ కీలకంగా మారిందని చెబుతున్న ట్రంప్ అక్కడకు కూడా గోల్డెన్ డోమ్ రక్షణను విస్తరిస్తామని చెబుతున్నారు. అయితే, కెనడా మాత్రం ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. గోల్డెన్ డోమ్ ప్రతిపాదన తమ ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేలా ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. చైనాతో వాణిజ్య సంబంధాలు



మెరుగుపరుచుకునేందుకు కూడా కెనడా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కెనడా, అమెరికాల మధ్య కొంత కాలంగా అసలేమాత్రం పొసగని విషయం తెలిసిందే. ఇక దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశాల్లో ఇరు దేశాల మధ్య ఎడం మరింత పెరిగింది. ట్రంప్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వ తీరును కెనడా ప్రధాని కార్నీ ఎండగట్టారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ నియమాలకు కాలం చెల్లినట్టు కనిపిస్తోందని అన్నారు. దీంతో, ట్రంప్ కూడా అంతేఘాటుగా స్పందించారు. ఇంతకాలం అమెరికా ఇచ్చే అనేక ఉచితాలను అనుభవించిన కెనడా కాస్తంత కృతజ్ఞతతో మసులుకోవాలని అన్నారు. కానీ వారిలో కృతజ్ఞత కనిపించట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తను ప్రతిపాదించిన గో÷-డలెన్ డోమ్‌తో కెనడాకు కూడా రక్షణ లభిస్తుందని అన్నారు. మిసైల్ దాడుల నుంచి రక్షణ కోసం అమెరికా ప్రభుత్వం గతేడాది తొలిసారిగా ఈ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ ఏర్పాటు చేసుకున్న ఐరోన్ డోమ్ వ్యవస్థ స్ఫూర్తితో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. మొదట్లో దీన్ని ఐరన్ డోమ్ ఆఫ్ అమెరికాగా మీడియాలో పేర్కొన్నప్పటికీ ఆ తరువాత ప్రభుత్వం గో÷-డలెన్ డోమ్‌గా పేరు మార్చింది. ఇందుకు అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని కెనడా ప్రభుత్వం భరిస్తే ఆ దేశానికి రక్షణ కల్పిస్తామని తెలిపింది.

# శాంసన్ స్థానాన్ని ఇషాన్ భర్తీ చేసే అవకాశం

భారత స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ దాదాపు 3 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జట్టులోకి తిరిగి వచ్చాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇషాన్ కిషన్ టీమిండియాలో భాగమయ్యాడు. మొదటి టీ20 మ్యాచ్‌లో విఫలమయ్యాడు, కానీ రెండవ టీ20లో అద్భుతమైన బ్యాటింగ్ చేశాడు. అతడి ఇన్నింగ్స్ సాధారణమని కొట్టిపారేయలేం. ఎందుకంటే ఇలాంటి ఇన్నింగ్స్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మీద ఒత్తిడి పెంచుతాయి. జట్టులో అసలుసిసలైన వికెట్ కీపర్ బ్యాటర్ కోసం టీమిండియా చాలా ఏళ్ల నుంచి వెతుకుతోంది. మరోవైపు వీరిద్దరూ టీ20 వరల్డ్ కప్ కోసం ఎంపికైన ఆటగాళ్లు. కనుక శాంసన్ విఫలం కావడంతో బీసీసీఐ వరల్డ్ కప్ లో ఇషాన్ కిషన్ కు ఛాన్స్ ఇవ్వనుందని ప్రచారం జరుగుతోంది. శుక్రవారం రాయ్‌పూర్‌లో జరిగిన సిరీస్‌లోని రెండవ టీ20లో ఇషాన్ కిషన్ కేవలం 32 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సర్ల సహాయంతో 76 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. మరోవైపు, సంజూ శాంసన్ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌లలోనూ విఫలమయ్యాడు. అతను 2 మ్యాచ్‌లలో వరుసగా 10, 06 పరుగులు చేశాడు. ఇషాన్ ఈ ఇన్నింగ్స్ 2026 టీ20 ప్రపంచ కప్ లో జట్టు ఈక్వేషన్‌ను మార్చే అవకాశం ఉంది. ఇంకా చెప్పాలంటే వికెట్ కీపర్ బ్యాటర్ స్థానానికి తుది జట్టులో రేసులో ఉన్నానని ఇషాన్ కిషన్ సంకేతాలు ఇచ్చాడు. మరోవైపు శాంసన్ వరుస మ్యాచ్ లలో విఫలమవుతూ ఏదో రోజు పెద్ద ఇన్నింగ్స్ ఆడతాడని విమర్శలు సైతం ఉన్నాయి. సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ ఇద్దరూ టీ20 ప్రపంచ కప్ కోసం ఎంపికైన ఇండియా ఆటగాళ్లు అని తెలిసిందే. పొట్టి ప్రపంచ కప్ కంటే ముందు భారత్ ఆడే సిరీస్ న్యూజిలాండ్‌తో జరుగుతోంది. ఈ టీ20 సిరీస్‌లోని మొదటి రెండు మ్యాచ్‌లలో ఇషాన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. రెండవ టీ20లో ఇషాన్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఓపెనింగ్ చేసేందుకు శాంసన్‌కు గట్టి పోటీ ఇస్తున్నాడు. ఈ ఫామ్‌తో ఇషాన్ కిషన్ టీ20 ప్రపంచ కప్‌లో ఓపెనింగ్‌లో అభిషేక్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేయవచ్చు. లేదా శాంసన్ ను పక్కనపెట్టి ఇషాన్ కిషన్‌కు తుది జట్టులో అవకాశం వచ్చినా ఆశ్చర్యం అక్కర్లేదు. ఇషాన్ ఓపెనింగ్‌కు వస్తే, మిడిల్ ఆర్డర్‌లో శాంసన్‌కు చోటు కష్టం కావచ్చు. ఇషాన్ కిషన్ కూడా వికెట్ కీపర్, దీని కారణంగా సంజుకు సరైన ప్రత్యామ్నాయంగా మారవచ్చు. ఈ పరిస్థితిలో శాంసన్ ప్రతి మ్యాచ్‌లోనూ రాణించక తప్పదు. రాబోయే ప్రపంచ కప్‌లో మరోసారి సంజూకు అవకాశాలు సన్నగిల్లే ఛాన్స్ ఉంది. 2024 టీ20 ప్రపంచ కప్‌లో కూడా సంజూ గురించి ఆలోచించినా పంత్ ఫాం, ఆటను చూసి అతడికి ఛాన్స్ ఇచ్చి, శాంసన్‌ను బెంచ్‌కు పరిమితం చేశారు. ఆ టోర్నమెంట్‌లో ఏ మ్యాచ్‌లోనూ ప్లేయింగ్ 11లో భాగం కాలేదు. ఇషాన్ కిషన్ డాషింగ్ ఇన్నింగ్స్ ఆడగలడు. టీ20 ఇంటర్నేషనల్ కెరీర్ లో ఇప్పటివరకు 34 మ్యాచ్‌లు ఆడాడు. ఈ మ్యాచ్‌లలోని 34 ఇన్నింగ్స్‌లలో 34 సగటుతో 129.98 స్ట్రైక్ రేట్‌తో 880 పరుగులు చేశాడు. ఇందులో 7 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఒకవేళ రైట్, లెఫ్ట్ కాంబినేషన్ కోసం చూస్తే మాత్రం సంజూ, అభిషేక్ ఓపెనింగ్ చేస్తారు. ఇషాన్ ఫాం ఇలాగే కొనసాగిస్తే అభిషేక్‌తో కలి ఇషాన్ ఓపెనింగ్ చేసినా ఆశ్చర్యం అక్కర్లేదు.




# ఒకే మ్యాచ్‌లో 5 ప్రపంచ రికార్డులు గల్లంతు




రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20లో టీమిండియా సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. న్యూజిలాండ్ నిర్దేశించిన 209 పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా కేవలం 15.2 ఓవర్లలోనే ఊదేశింది. సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ బ్యాట్‌లతో విరుచుకుపడటంతో మైదానంలో పరుగుల వరద పారింది. ఈ మ్యాచ్‌లో గెలుపుతో పాటు ఏకంగా ఐదు భారీ రికార్డులు బద్దలయ్యాయి. కివీస్ బౌలర్లు చుక్కలు చూడగా, భారత బ్యాటర్లు చరిత్ర తిరగరాశారు. భారత యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌లో ఊచకోత కోశాడు. కేవలం 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి, టీ20ల్లో న్యూజిలాండ్‌పై అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన భారత ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. సరిగ్గా 48 గంటల క్రితమే అభిషేక్ శర్మ (22 బంతుల్లో 50) నెలకొల్పిన రికార్డును ఇషాన్ చెరిపేయడం విశేషం. సాధారణంగా పవర్ ప్లేలో ఓపెనర్లు మాత్రమే హాఫ్ సెంచరీలు సాధిస్తుంటారు. కానీ ఈ మ్యాచ్‌లో సంజు శాంసన్ త్వరగా అవుట్ కావడంతో వన్ డౌన్‌లో వచ్చిన ఇషాన్ కిషన్, పవర్ ప్లే ముగిసేలోపే తన యాభై పరుగులు పూర్తి చేశాడు. తద్వారా పవర్ ప్లేలో హాఫ్ సెంచరీ బాదిన తొలి నాన్ ఓపెనర్ భారత బ్యాటర్‌గా ఇషాన్ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో (ఫుల్ మెంబర్ జట్ల మధ్య) 200 కంటే ఎక్కువ పరుగుల లక్ష్యాన్ని అత్యంత వేగంగా ఛేదించిన జట్టుగా భారత్ నిలిచింది. 209 పరుగుల లక్ష్యాన్ని 28 బంతులు మిగిలి ఉండగానే టీమ్ ఇండియా పూర్తి చేసింది. గతంలో పాకిస్థాన్ (24 బంతులు మిగిలి ఉండగా 205 రన్స్ ఛేజ్) పేరిట ఉన్న రికార్డును భారత్ బద్దలు కొట్టింది. న్యూజిలాండ్ బౌలర్ జాక్ ఫౌల్క్స్ కు ఈ మ్యాచ్ ఒక పీడకల. కేవలం 3 ఓవర్లలోనే 67 పరుగులు సమర్పించుకున్నాడు. టీ20 క్రికెట్ చరిత్రలో ఒక కివీస్ బౌలర్ ఒకే మ్యాచ్‌లో ఇన్ని పరుగులు ఇవ్వడం ఇదే మొదటిసారి. 2018లో బెన్ వీలర్ (64 పరుగులు) పేరిట ఉన్న చెత్త రికార్డును ఫౌల్క్స్ తన ఖాతాలో వేసుకున్నాడు. భారత పేసర్ అర్షదీప్ సింగ్ కూడా ఒక అవాంఛనీయ రికార్డును మూటగట్టుకున్నాడు. మ్యాచ్‌లోని తొలి ఓవర్‌లోనే 18 పరుగులు ఇచ్చి, టీ20ల్లో మొదటి ఓవర్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన భారత బౌలర్‌గా నిలిచాడు. గతంలో 2022లో ఐర్లాండ్ ప్లేయర్ పాల్ స్టిర్లింగ్ భారత బౌలర్‌పై 18 పరుగులు రాబట్టగా, ఇప్పుడు అర్షదీప్ ఆ రికార్డును సమం చేశాడు.

## టీ20 ప్రపంచకప్పు నుంచి పాక్ తప్పుకుంటుందా?

టీ-20 ప్రపంచకప్పు నుంచి బంగ్లాదేశ్‌ను తప్పిస్తూ ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) తప్పుబట్టింది. అందుకు నిరసనగా టోర్నీని బహిష్కరించాలని యోచిస్తోంది. ప్రపంచకప్పులో పాల్గొనడంపై తమ ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ వెల్లడించారు. టోర్నీని బహిష్కరించాలా, లేదా పాల్గొనాలా అనే విషయాన్ని తమ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ముందు ఉంచుతామన్నారు. ప్రస్తుతం ప్రధాని స్వదేశంలో లేరని, వచ్చాక ఆయన సలహా తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని నఖ్వీ స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వద్దంటే అప్పుడు ఐసీసీ మరో జట్టును ఆహ్వానిస్తుందని విమర్శించారు. ప్రపంచ క్రికెట్‌లో బంగ్లాదేశ్ పెద్ద వాటాదారు అని, ఆ జట్టుకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఐసీసీ పక్షపాత నిర్ణయాలు తీసుకుందని నఖ్వీ ఆక్షేపించారు. పాకిస్థాన్, భారత్ కోసం వేదికలను మార్చి వారికి అనుకూలంగా వ్యవహరించినప్పుడు, బంగ్లాదేశ్ విషయంలో అలా ఎందుకు చేయలేదని నఖ్వీ ప్రశ్నించారు.

# స్మృతి మంధాన పెళ్లి రద్దుపై సంచలన ఆరోపణలు



టీమిండియా మహిళా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్ పెళ్లి రద్దు కావడం వెనుక అత్యంత దిగ్భ్రాంతికరమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంపై స్మృతి బాల్య మిత్రుడు విధాన మానే చేసిన సంచలన ఆరోపణలు ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. నవంబర్ 23, 2025న మహారాష్ట్రలోని సాంగ్లీలో స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్‌ల వివాహం ఘనంగా జరగాల్సి ఉంది. కానీ పెళ్లి రోజే ముహూర్తం ఆగిపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అప్పట్లో స్మృతి తండ్రికి ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రిలో చేరడం వల్లే పెళ్లి వాయిదా పడిందని భావించారు. కానీ అసలు కారణం అది కాదని, పలాష్ ముచ్చల్ మోసం చేయడమేనని ఇప్పుడు తేలింది. స్మృతి మంధాన చిన్ననాటి స్నేహితుడు విధాన మానే ఓ ఇంటర్వ్యూలో పలాష్‌పై సంచలన ఆరోపణలు చేశారు. "పెళ్లి వేడుకలు జరుగుతున్న సమయంలో పలాష్ మరో మహిళతో కలిసి పడకగదిలో రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయాడు. ఆ దృశ్యాన్ని చూసి మేమంతా షాక్ అయ్యాం. ఆ సమయంలో అక్కడ ఉన్న భారత మహిళా క్రికెటర్లు ఆగ్రహంతో పలాష్‌ను చితకబాదారు" అని విధాన మానే వెల్లడించారు. కేవలం స్మృతిని మోసం చేయడమే కాకుండా, పలాష్ తన దగ్గర నుంచి కూడా భారీగా డబ్బులు వసూలు చేశాడని విధాన మానే ఆరోపించారు. ఒక సినిమా నిర్మిస్తానని చెప్పి పలాష్ తన దగ్గర రూ. 40 లక్షలు తీసుకున్నాడని, కానీ ఇప్పటివరకు సినిమా తీయలేదని, డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. పెళ్లి రద్దు అయినప్పటి నుంచి పలాష్ తన ఫోన్ కాల్స్ ఎత్తడం లేదని, అతను ఓ పెద్ద మోసగాడని విధాన మానే మండిపడ్డారు. స్మృతి మంధాన కుటుంబం ఈ ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. పలాష్ పెళ్లి చేసుకుని సాంగ్లీలోనే స్థిరపడతాడని తాము ఆశించామని, కానీ అతని అసలు స్వరూపం బయటపడటంతో స్మృతి తండ్రి మనస్తాపానికి గురై అనారోగ్యం పాలయ్యారని సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం స్మృతి ఈ చేదు జ్ఞాపకాల నుంచి కోలుకోవడానికి ప్రయత్నిస్తోంది.

# మళ్లీ రెచ్చిపోయిన హార్దిక్




టీమిండియా ఆటగాళ్లు మైదానంలో ఎంత దూకుడుగా ఉంటారో, కొన్నిసార్లు మైదానం బయట కూడా అంతే వేడిని ప్రదర్శిస్తుంటారు. తాజాగా రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20కి ముందు హార్దిక్ పాండ్యాకు సంబంధించిన ఒక వీడియో చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు హార్దిక్ ప్రాక్టీస్ కోసం మైదానంలోకి వస్తున్న సమయంలో, అక్కడ ఉన్న కామెంటేటర్ మురళీ కార్తీక్‌తో ఏదో విషయంలో వాగ్వాదానికి దిగాడు. మొదట సాధారణంగా మొదలైన వీరి సంభాషణ, కొద్దిసేపటికే సీరియస్ చర్చగా మారింది. హార్దిక్ ముఖ కవళికలు చూస్తుంటే అతను చాలా కోపంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. వైరల్ అవుతున్న వీడియోను గమనిస్తే.. హార్దిక్ మాట్లాడుతూ దూరం వెళ్లిపోవడం, మళ్ళీ వెనక్కి వచ్చి మురళీ కార్తీక్ దగ్గర నిలబడి గట్టిగా ఏదో చెప్పడం కనిపిస్తుంది. మురళీ కార్తీక్ కూడా తన వాదనను వినిపించడానికి ప్రయత్నించినప్పటికీ, హార్దిక్ ఏమాత్రం తగ్గలేదు. ఈ వీడియోను షేర్ చేసిన క్రికెట్ సెంట్రల్ అనే ఎక్స్ ఖాతా.. "రాయ్‌పూర్‌లో రెండో టీ20 ప్రారంభానికి ముందు హార్దిక్ పాండ్యా, మురళీ కార్తీక్ మధ్య పెద్ద గొడవ జరిగింది" అని పేర్కొంది. అయితే ఈ గొడవకు గల అసలు కారణం ఏమిటనేది మాత్రం ఇంకా అధికారికంగా తెలియలేదు. కేవలం అది సరదా చర్చా లేక నిజంగానే విభేదాలా అన్నదానిపై స్పష్టత లేదు. మరోవైపు న్యూజిలాండ్ సిరీస్‌లో హార్దిక్ పాండ్యా తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. నాగ్‌పూర్‌లో జరిగిన తొలి టీ20లో బ్యాట్‌తో 25 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో ఒక వికెట్ తీశాడు. ఇక రాయ్‌పూర్‌లో జరిగిన రెండో టీ20లో టీమ్ ఇండియా టాప్ ఆర్డర్ బ్యాటర్లు లక్ష్యాన్ని త్వరగా ముగించడంతో హార్దిక్‌కు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కానీ, బౌలింగ్‌లో ఒక కీలక వికెట్ పడగొట్టి తన వంతు సహకారం అందించాడు. ఈ గొడవ వీడియోపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు హార్దిక్ వైఖరిని తప్పుపడుతుంటే, మరికొందరు మురళీ కార్తీక్ ఏమైనా అనవసరమైన ప్రశ్నలు అడిగి ఉంటారా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా హార్దిక్ మైదానంలో తన సహచర ఆటగాళ్లపై, ప్రత్యర్థులపై కోపం ప్రదర్శించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఒక సీనియర్ మాజీ క్రికెటర్‌తో ఇలా వ్యవహరించడం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ వివాదంపై అటు హార్దిక్ కానీ, ఇటు మురళీ కార్తీక్ కానీ ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు.

# ఎప్రిల్ 10న స్వయంభు విడుదల



యంగ్ అండ్ డైనమిక్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిపోయే అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'స్వయంభూ' విడుదల తేదీని చింత్రబృందం ప్రకటించింది. ఈ సినిమా విడుదలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ ఏడాది వేసవి కానుకగా, ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ పాన్-ఇండియా చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా కోసం నిఖిల్ పడుతున్న శ్రమ అంతా ఇంతా కాదు. ఒక యోధుడి పాత్రలో పరకాయ ప్రవేశం చేయడానికి ఆయన తన శరీరాకృతిని పూర్తిగా మార్చుకున్నారు. కేవలం ఫిజిక్ మాత్రమే కాకుండా, యుద్ధ సన్నివేశాల్లో సహజత్వం కోసం విదేశాల్లో కత్తిసాము, గుర్రపు స్వారీ ,విలువిద్యలో ప్రత్యేక శిక్షణ పొందారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో విజువల్స్ హాలీవుడ్ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటాయని సమాచారం. అయితే తాజాగా నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లింప్స్ ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సినిమాపై అంచనాలను మరో మెట్టు ఎక్కించింది. ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న ఈ చారిత్రక గాథ తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.

# బాలకృష్ణ, గోపీచంద్ కాంబినేషన్‌లో 111వ సినిమా

## మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు ప్లాన్

నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్ అంటేనే బాక్సాఫీస్ వద్ద మాస్ జాతర మొదలైనట్లే. 'వీరసింహా రెడ్డి' వంటి భారీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న 111వ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అయితే, ఈ సినిమా షూటింగ్ విషయంలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న సస్పెన్స్‌కు ఇప్పుడు తెరపడింది. మొదట ఈ ప్రాజెక్ట్‌ను సుమారు రూ.170 కోట్ల భారీ బ్జడెట్‌తో ఒక చారిత్రక నేపథ్యం ఉన్న కథతో చేయాలనుకున్నారు. కానీ, ప్రస్తుతం మారిన మార్కెట్ పరిస్థితులు, బ్జడెట్ లెక్కల దృష్ట్యా ఆ కథను పక్కన పెట్టి, బాలయ్య ఇమేజ్‌కు సరిపోయే పక్కా మాస్ యాక్షన్ కథను గోపీచంద్ సిద్ధం చేశారు. ఇటీవలే దర్శకుడు వినిపించిన ఈ కొత్త కథకు బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, వచ్చే మార్చి నెల నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ 'వృద్ధి సినిమాస్' ధృవీకరించింది. తొలి షెడ్యూల్‌లోనే బాలయ్య మార్క్ అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ఇక హీరోయిన్ విషయానికి వస్తే, పాత కథ ప్రకారం నయనతారను ఎంపిక చేసినప్పటికీ, ఇప్పుడు కథ మారడంతో ఆమెనే కొనసాగిస్తారా లేక కొత్త హీరోయిన్‌ను తీసుకుంటారా అనే దానిపై సస్పెన్స్ నెలకొంది. ఏదేమైనా, బాలయ్య మార్క్ పవర్‌ఫుల్ డైలాగులు, గోపీచంద్ టేకింగ్ కలిసి మరోసారి బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాయడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.







## స్నేహానికి మించి అడుగు వేయాలి.. మనసు విప్పిన దిశా పటానీ

సీకే బ్యూటీ దిశా పటానీ ఏం చేసినా అది సంచలనంగానే మారుతుంది. దిశా తన ప్రియుడు టైగర్ ష్రాఫ్ నుంచి విడిపోయిన తర్వాత కూడా తన స్నేహాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఇప్పడు టైగర్ గురించి దిశా పటానీ ఓపెనవ్వడం చర్చగా మారింది. దిశా తన మనసులోని మాటను ఇంత బహిరంగంగా చెప్పడం నిజంగా ఆశ్చర్యకరం. దిశా నిజాయితీకి నిదర్శనం! ఎట్టకేలకు ఈ అమ్మడు తన మనసులోని మాటను బయటపెట్టింది. టైగర్ ష్రాఫ్ గురించి దిశా ఇంతకీ ఏం చెప్పింది? దిశా ఎన్నడూ లేనంత ఇదిగా ఎమోషనల్‌గా మాట్లాడింది ఈసారి. జిమ్నాస్టిక్స్ నేర్చుకోవడం, ఫైర్ రింగ్‌ల నుండి ఫ్లిప్స్ చేయడం వంటివి కేవలం సినిమాల కోసమే కాదు, టైగర్‌ను ఇంప్రెస్ చేయడానికి కూడా అని దిశా చెప్పింది. తన మాట తీరు చూస్తుంటే, వారి మధ్య ఉన్న బంధం ఎంత ఘాఢమైనదో అర్థం చేసుకోవచ్చు. చాలా సంవత్సరాలుగా వీరిద్దరూ -కేవలం మంచి స్నేహితులం- అని ఇంటర్వ్యూలలో చెప్పుకుంటూ వచ్చారు. కానీ దిశా ఇప్పుడు దానిని -ఐస్ బ్రేక్-లా బ్రేక్ చేయాలని, స్నేహానికి మించి తదుపరి అడుగు వేయాలని స్పష్టంగా కోరుకుంటున్నట్టు తన మాటలు చెబుతున్నాయి. టైగర్ ష్రాఫ్ తన ప్రశాంత స్వభావం వల్ల చాలా నెమ్మదిగా ఉన్నాడని, త్వరగా ఏ నిర్ణయమూ చెప్పడని దిశా మాటలను బట్టి అర్థమవుతోంది. టైగర్ స్వతహాగా మార్షల్ ఆర్ట్స్, ఫిట్‌నెస్‌లో ఎవరికీ అందనంత ఎత్తులో ఉంటారు. బహుశా అందుకే దిశా ఎన్ని ఫీట్లు చేసినా ఆయనకు అవి -సాధారణంగా- అనిపిస్తున్నాయేమో! కానీ దిశా ప్రయత్నం మాత్రం అమోఘం. కేవలం ఒక వ్యక్తి కోసం తన ప్రాణాలకు తెగించి ఫైర్ రింగ్ ఫ్లిప్స్ చేయడం అంటే అది మామూలు విషయం కాదు. ఇప్పుడు టైగర్ ఏం చేయాలి? అంటే అతడు కూడా మనసు విప్పి మాట్లాడాలి. తన స్నేహితురాలి మనసును అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి. దిశా తన -ప్రేమ హక్కు- కోసం ధైర్యంగా గొంతు విప్పినట్టే టైగర్ కూడా మనసు విప్పాలి. మార్చి రిలీజ్ డెడ్ లైన్ కోసం.. పవన్ కళ్యాణ్ సినిమా కోసం హరీష్ శంకర్ ఎలాగైతే స్పీడ్ అప్ అవ్వాలో, దిశా మనసు గెలుచుకోవడానికి టైగర్ కూడా కొంచెం -స్పీడ్ అప్- అవ్వాల్సిన సమయం వచ్చింది! దిశా పటానీ ఇంతలా ప్రయత్నిస్తున్నా టైగర్ ఇంకా -ఇంప్రెస్- అవ్వకపోవడం వెనుక కారణం ఏమై ఉంటుంది? అతడు ఇంకా దిశాలో ఏవైనా ప్రత్యేక క్వాలిటీస్ ని ఆశిస్తున్నాడా? దిశా ఇంతకుముందు ప్రభాస్ కల్కి 2898 ఏడి చిత్రంలో నటించింది. తదుపరి సీక్వెల్ లో కనిపిస్తుందా లేదా చూడాలి. ఓ రోమియో, వెల్ కం టు ది జంగిల్, అవారాపాన్ 2, సంఘమిత్ర చిత్రాలు విడుదలకు రావాల్సి ఉంది.

# నెట్‌ఫ్లిక్స్‌లో 29న ఛాంపియన్ విడుదల



తెలంగాణ రాజకార్లను ఎదురొడ్డిన బైరాన్‌పల్లి గ్రామ కథ ఆధారంగా రోషన్ హీరోగా తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'ఛాంపియన్' గత డిసెంబరులో బాక్సాఫీసు ముందుకొచ్చి మంచి టాక్ తెచ్చుకుంది. ఇందులోని గిరగిరతో పాటు పాటలు హిట్ అయ్యాయి. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'నెట్‌ఫ్లిక్స్' లో ఈనెల 29 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనస్వర రాజన్, అవంతిక, రచ్చరవి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులోని 'గిర గిర గింగిరాగిరే' పాట విశేషంగా అలరించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న రోజులవి. రజాకార్ల దౌర్జన్యాలకు తెలంగాణ పల్లెలన్నీ చిగురుటాకులా వణికిపోతుండగా.. బైరాన్‌పల్లి లాంటి కొన్ని ఊళ్లు మాత్రం వీరోచితంగా పోరాడుతూ అందరిలో స్వాతంత్ర్య కాంక్ష రగిలించే ప్రయత్నం చేస్తుంటాయి. అదే సమయంలో సికింద్రాబాద్‌కు చెందిన ఆంగ్లో ఇండియన్ కుర్రాడు మైఖేల్ సి.విలియమ్స్ (రోషన్) ఫుట్‌బాల్ ఆటగాడిగా ఎంతో పేరు తెచ్చుకుంటాడు. తన ప్రతిభతో ఇంగ్లాండ్ మాంచెస్టర్ ఫుట్‌బాల్ క్లబ్‌లో ఆడే అవకాశాన్ని అందుకుంటాడు. కానీ, మైఖేల్ తండ్రి నేపథ్యం కారణంగా తను లీగల్‌గా ఆ దేశానికి వెళ్లే దారులు మూసుకుపోతాయి. దీంతో ఎలాగైనా 20 రోజుల్లో ఇంగ్లాండ్‌కు వెళ్లేందుకు అక్రమ మార్గం ఎంచుకుంటాడు. కానీ, దారితప్పి బైరాన్‌పల్లికి వెళతాడు? దానికి కారణమేంటి? ఆ ఊరి వాళ్లతో కలిసి రజాకార్లపై పోరుకు ఎందుకు సిద్ధమయ్యాడు? బైరాన్‌పల్లి గ్రామస్థుల పోరాటాన్ని అణగదొక్కి.. వాళ్లను అంతం చేసేందుకు ఖాసిం రజ్వీ రంగంలోకి దింపిన బాబు దేశ్‌ముఖ్ (సంతోష్ ప్రతాప్)తో మైఖేల్‌కు ఉన్న విరోధం ఏంటి? అన్నది మిగతా కథ.


# ధురంధర్‌ను మించిన బోర్డర్-2



దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కిన 'బోర్డర్ 2' తొలిరోజు కలెక్షన్ల విషయంలో 'ధురంధర్' ను బీట్ చేసింది. శుక్రవారం విడుదలైన 'బోర్డర్ 2' అదే రోజు.. భారతీయ బాక్సాఫీసు వద్ద రూ.32 కోట్లు (నెట్) కలెక్షన్లు రాబట్టింది. 'ధురంధర్' తొలిరోజు కలెక్షన్లు రూ.28.60 కోట్లు మాత్రమే. సన్నీ దేవోల్, వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్, అహాన్ శెట్టి ప్రధాన పాత్రల్లో అనురాగ్ సింగ్ 'బోర్డర్ 2'ను తెరకెక్కించారు. 1971 ఇండో - పాక్ యుద్ధం నేపథ్యంలో జేపీ దత్తా తెరకెక్కించిన 'బోర్డర్'కు కొనసాగింపుగా వచ్చింది. ఈ సీక్వెల్ 28 ఏళ్ల తర్వాత వచ్చినా ప్రేక్షకాదరణ పొందడం విశేషం. ఈ సినిమా 1971 యుద్ధం తర్వాత జరిగిన మరో కీలకమైన సరిహద్దు పోరాటం చుట్టూ తిరుగుతుంది. మొదటి భాగంలో కేవలం ఆర్మీ పోరాటాన్ని మాత్రమే చూపిస్తే.. ఈసారి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా చేసిన త్రిముఖ పోరును కళ్లకు కట్టినట్లు ఉద్వేగభరితంగా చూపించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబరు 5న విడుదలైన ఈ సినిమా రూ.1300? కోట్లు రాబట్టింది. అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ చిత్రాల జాబితాలో రెండో స్థానం, అత్యధిక కలెక్షన్లు రాబట్టిన భారతీయ సినిమా లిస్ట్‌లో నాలుగులో స్థానంలో నిలిచింది. తొలిరోజు కలెక్షన్ల హవాని బట్టి ఈ 'ధురంధర్' రికార్డును 'బోర్డర్ 2' అధిగమించే అవకాశాలున్నాయని సినీ వర్గాల టాక్.

## రాజాసాబ్ నుంచి సహనా సహనా వీడియో సాంగ్ విడుదల

సంక్రాంతి కానుకగా బాక్సాఫీసు ముందుకొచ్చిన చిత్రాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కించిన చిత్రమిది. ఇందులోని మెలొడీ 'సహనా సహనా' ఫుల్ వీడియో విడుదలైంది. ప్రభాస్- నిధి అగర్వాల్‌పై రూపొందించిన సాంగ్ ఇది. ఈ చిత్రం మంచి టాక్‌తో ప్రభాస్ మేనరిజాన్ని బాగా ఎలివేట్ చేసింది. మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినమా థియేటర్లలో ఆడుతోంది.



## అల్ఫోర్స్ గర్ల్స్ ఇ-టెక్నో పాఠశాల "తరంగ్" వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ

### విద్యార్థులకు నైతిక విలువలు, సామాజిక బాధ్యత అలవాటు చేయాలి -- శ్రీమతి డి. సాధన




కరీంనగర్, జనత న్యూస్ : విద్యార్థులకు చిన్ననాటి నుంచే నైతిక విలువలు, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పిస్తూ సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని శ్రీమతి డి. సాధన, చైర్‌పర్సన్ -- LRAT, అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్, కరీంనగర్ అన్నారు. స్థానిక రేకుర్తి రోడ్‌లోని ప్రైవేట్ వేడుక మందిరంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అల్ఫోర్స్ గర్ల్స్ ఇ–టెక్నో పాఠశాల "తరంగ్" వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు సమాజంపై స్పష్టమైన అవగాహన కల్పిస్తూ, చక్కటి ప్రణాళికలతో ముందుకు నడిపితే విజయం సాధించడం సులభమవుతుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు అవసరమైన వనరులు సమకూర్చడమే కాకుండా, నిరంతరం ప్రోత్సాహం అందిస్తూ సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో వినోదంతో పాటు చదువుపట్ల ఆసక్తి పెరుగుతుందని, క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకు సాగే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో స్థిరపడతారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల మాటలను అనుసరిస్తూ, ఉపాధ్యాయులు బోధించిన విషయాలను సాధన చేస్తే ఘనవిజయాలు సాధ్యమవుతాయని అన్నారు. డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని, తరగతి గదిలో బోధించిన అంశాలను తరచూ పునశ్చరణ చేయడం ద్వారా విద్యలో పట్టు సాధించవచ్చని తెలిపారు. నేటి పరిస్థితుల్లో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రతిభను గుర్తించి దానిని వెలికితీసే దిశగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ప్రశంసలు పొందాయి. వార్షిక ప్రణాళికలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు హుస్నాబాద్ డిపో సిద్ధం



హుస్నాబాద్, జనత న్యూస్: మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం హుస్నాబాద్ ఆర్టీసీ డిపో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతర పురస్కరించుకుని ప్రత్యేక బస్సుల నిర్వహణపై డిపో మేనేజర్ వెంకన్న నాయక్ శనివారం వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హుస్నాబాద్ డిపో నుండి 35 బస్సులతో పాటు ఇతర డిపోల నుండి మరో 15 బస్సులను సేకరించి, మొత్తం 50 ప్రత్యేక బస్సులను మేడారానికి నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఛార్జీలను ఖరారు చేశామని, పెద్దలకు 350 రూపాయలు, పిల్లలకు 200 రూపాయలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. బస్టాండ్‌కు వచ్చే భక్తులకు ఎండ తగలకుండా టెంట్లు, రాత్రి సమయంలో ఇబ్బంది లేకుండా విద్యుత్ దీపాలు, దాహార్తి తీర్చడానికి తాగునీటి వసతిని కల్పించామన్నారు. టికెట్ల జారీలో జాప్యం జరగకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశామని, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని డిఎం వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది మురళి, తిరుపతి గౌడ్, సురేష్, వెంకటేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డును పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తాం

### బయోమైనింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించిన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



కరీంనగర్, జనతా న్యూస్ : డంపింగ్ యార్డును పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో శనివారం అధికారులు, సిబ్బందితో కలిసి బైపాస్‌లో ఉన్న డంపింగ్ యార్డును సందర్శించారు. బయోమైనింగ్ ప్రక్రియలో భాగంగా డంపింగ్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునాతన బయోమైనింగ్ యంత్రాన్ని పరిశీలించారు. చెత్త రీసైక్లింగ్ ప్రక్రియలో భాగంగా యంత్రం ట్రయల్ రన్‌ను ప్రారంభించి దాని పని తీరును పరిశీలించారు. చెత్తను మూడు విభాగాలుగా వేరు చేసి రీసైక్లింగ్ చేస్తున్న విధానం, గంటకు ఎన్ని టన్నుల చొప్పున చెత్తను బయోమైనింగ్ చేస్తున్నదనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా చెత్తను వేగవంతంగా శుద్ధి చేసి డంపింగ్ యార్డును పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని ఆదేశాలు జారీ చేశారు. బయోమైనింగ్ పనులు నిరంతరంగా సాగాలని, పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు.

# ఆన్‌లైన్‌లోనే ఇసుక బుకింగ్ విధానం

### ప్రయోగాత్మకంగా కరీంనగర్‌లో అమలు

### ఇందిరమ్మ ఇండ్లకు ప్రత్యేక అవకాశం




కరీంనగర్, జనత న్యూస్ : ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఇసుక బుకింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్, గనులు--భూగర్భ శాఖ డైరెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్న నేపథ్యంలో కరీంనగర్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ఆన్‌లైన్ ఇసుక ప్రక్రియలో భాగంగా "మన ఇసుక వాహనం" యాప్ ద్వారా ప్రభుత్వం బుకింగ్ విధానాన్ని ప్రవేశపెడుతోందన్నారు. ఈ విధానం ద్వారా వినియోగదారులకు ఇసుక సరఫరా మరింత పారదర్శకంగా మారుతుందని, మధ్యవర్తుల పాత్ర లేకుండా నేరుగా ఇసుకను పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. దీని వల్ల భవన నిర్మాణ రంగంలో ఇసుక కొరత తీరడంతో పాటు అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందని చెప్పారు.

రవాణా పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే జరగాలని, మాన్యువల్ రసీదులు జారీ చేయవద్దని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం యాప్‌లో ప్రత్యేక అవకాశం కల్పించామని, ఇందిరమ్మ లబ్ధిదారులు ఇరవై ఐదు క్యూబిక్ మీటర్ల ఇసుక పొందే వీలుంటుందని తెలిపారు. ప్రయోగాత్మక జిల్లాల అనంతరం ఇసుక నిల్వలు ఉన్న రాష్ట్రంలోని సుమారు పదహారు జిల్లాల్లో ఈ విధానాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. ఇసుక అవసరం ఉన్నవారు మొబైల్‌లో "మన ఇసుక వాహనం" యాప్ డౌన్‌లోడ్ చేసుకొని బుక్ చేసుకోవాలని, లేదా ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. స్మార్ట్ ఫోన్లు లేని వారు గ్రామపంచాయతీ కార్యదర్శులను సంప్రదించి బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు.

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, మన ఇసుక వాహనం ఆన్‌లైన్ బుకింగ్ విధానం అమలుకు జిల్లాను ఎంపిక చేసిన నేపథ్యంలో అధికారులు నిబద్ధతతో పనిచేసి విజయవంతం చేయాలని అన్నారు. తహసీల్దార్లు విధులను పకడ్బందీగా నిర్వహించాలని, ఆర్డీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొత్త విధానానికి అనుగుణంగా పదిహేను రోజుల్లోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్, ప్రాజెక్టు మేనేజర్ రాధాకృష్ణ, తహసీల్దార్లు, గనులు, గృహ నిర్మాణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తేనే ప్రాణాలు కాపాడుకోవచ్చు

### - జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




కరీంనగర్, జనవరి 24 : ముప్పై ఏడవ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కరీంనగర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలో పెద్ద ఎత్తున ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రమాదాల సమయంలో తలకు గాయం కాకుండా ఉంటే ప్రాణాలు కాపాడుకోవచ్చని, శిరస్త్రాణం ధరించడం ఎంతో అవసరమని చెప్పారు. వాహనదారులు తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ర్యాలీలో పాల్గొన్న వారికి పోలీస్ శాఖ తరఫున శిరస్త్రాణాలు పంపిణీ చేశారు.

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ గత సంవత్సరం రోడ్డు ప్రమాదాల్లో రెండు వందల మంది మృతి చెందారని తెలిపారు. అందులో ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులేనని చెప్పారు. శిరస్త్రాణం ధరించకపోవడమే చాలా ప్రమాదాలకు కారణమవుతోందని పేర్కొన్నారు. రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటిస్తే చాలా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ర్యాలీ పోలీస్ పరేడ్ మైదానం నుంచి ప్రారంభమై నగర ప్రధాన రహదారుల మీదుగా సాగి తిరిగి పరేడ్ మైదానంలో ముగిసింది. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యార్థుల ధైర్యం, ఆత్మవిశ్వాసం అభినందనీయం

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

### వేదికపై ఆకట్టుకున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



కరీంనగర్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కష్టమైన అంశాలను ఎంచుకొని ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో మాట్లాడటం అభినందనీయమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. వారి ప్రతిభ అందరినీ ఆకట్టుకుందని ప్రశంసించారు. పాఠశాల విద్యా శాఖ, పారమిత విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యంలో భాగంగా పారమిత విద్యాసంస్థలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తూ, వేదికపై మాట్లాడే నైపుణ్యాలను పెంపొందిస్తున్నాయి. ఈ శిక్షణ పొందిన విద్యార్థులు ఆసక్తికరమైన అంశాలపై ధైర్యంగా, స్పష్టంగా మాట్లాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు వేదికపై ప్రసంగాలు చేసి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రభుత్వ విద్యార్థులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ. ప్రసాద్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సేవ చేయడం తమకు గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే, విద్యాశాఖ సమన్వయకర్త అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'రామ్' అనే పేరున్నందుకే చట్టాన్ని వ్యతిరేకించడం కాంగ్రెస్ దివాళాకోరుతనం

### బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి



రామడుగు, జనతా న్యూస్ : ఉపాధి హామీ పథకంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ, కూలీల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వికసిత భారత్ గ్యారెంటీ (వి.బి.జి) రామ్ జీ -- 2025' చట్టాన్ని కేవలం అందులో 'రామ్' అనే పేరున్నందుకే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం ఆ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి విమర్శించారు. రామడుగు మండల కేంద్రంలో బీజేపీ వికసిత భారత్ మండల కన్వీనర్ సంటి జితేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి మంచి కార్యక్రమాన్ని అడ్డుకోవడమే కాంగ్రెస్ అలవాటుగా మార్చుకుందని ఆరోపించారు.

రాఫెల్ యుద్ధ విమానాలు, ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం, స్వచ్ఛ భారత్, వందే భారత్ రైళ్లు, నూతన న్యాయ సంహిత వంటి చారిత్రాత్మక నిర్ణయాలను కూడా కాంగ్రెస్ వ్యతిరేకించిందని, అయినప్పటికీ దేశ ప్రజలు ఇప్పటికే ఆ పార్టీని తిరస్కరించారని అన్నారు. ఈ చట్టం ద్వారా కూలీలకు ఏటా 125 రోజుల పని కల్పించే చట్టబద్ధమైన హామీ, పనిచేసిన 15 రోజుల్లోనే నేరుగా ఖాతాల్లో వేతనాల జమ, ఉపాధి హామీ బడ్జెట్‌ను రూ. 86 వేల కోట్ల నుంచి రూ. 1.50 లక్షల కోట్లకు పెంపు జరిగిందని తెలిపారు. తెలంగాణకు అదనంగా రూ. 346 కోట్ల నిధులు కేటాయించడం ద్వారా కూలీలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. డిజిటల్ హాజరు విధానం ద్వారా అవినీతికి తావు లేకుండా అర్హులైన కూలీలకు సరైన వేతనం అందుతుందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో 2004 నుంచి 2014 వరకు కేవలం రూ. 1.89 లక్షల కోట్లు మాత్రమే ఉపాధి పనులకు కేటాయిస్తే, 2014 నుంచి 2024 వరకు కేంద్ర ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని వివరించారు. ఉపాధి హామీ చట్టంపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని బీజేపీ కార్యకర్తలు గ్రామగ్రామాన తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధికి, భూగర్భ జలాల పెంపునకు, మౌలిక వసతుల కల్పనకు ఈ చట్టం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కూలీలకు నష్టం చేసే విధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌కు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పోచంపెల్లి నరేష్, మండల ఉపాధ్యక్షులు కాడే నర్సింగం, కళ్లెం శివ, వెంకట్రావుపల్లి ఉపసర్పంచ్ బద్దం లక్ష్మారెడ్డి, వికసిత భారత్ మండల కో–కన్వీనర్ బండారి శ్రీనివాస్, యువ మోర్చా నాయకులు ఎడవల్లి రామ్, లక్ష్మణ్, అధికార ప్రతినిధి వంచ మనోజ్, సీనియర్ నాయకులు జిట్టవేని అంజిబాబు, శెవెళ్ల అక్షయ్, దయ్యాల వీరమల్లు, పురంశెట్టి మల్లేశం, గోపు అనంత రెడ్డి, కుమ్మరి అనిల్, బీర్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క--సారలమ్మ జాతర ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు

## రేకుర్తిలో ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



కరీంనగర్, జనతా న్యూస్ : సమ్మక్క--సారలమ్మ వన దేవతల జాతరను ఘనంగా నిర్వహిస్తామని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వన దేవతల జాతరను పురస్కరించుకుని శనివారం ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో కలిసి రేకుర్తి సమ్మక్క--సారలమ్మ గద్దెలను సందర్శించారు. ముందుగా వన దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జాతర నిర్వహణ కోసం నగరపాలక సంస్థ చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. సమ్మక్క--సారలమ్మ గద్దెలను పరిశీలించిన అనంతరం జాతర పరిసర ప్రాంతాల్లో పర్యటించి, పార్కింగ్ స్థలాలు, మౌలిక సదుపాయాల కల్పన, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, దుకాణ సముదాయాల ఏర్పాటుకు కేటాయించిన స్థలాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేస్తూ, జాతర నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, సమ్మక్క--సారలమ్మ వన దేవతల జాతర తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తి, బొమ్మకల్ ప్రాంతాల్లో జరిగే జాతర నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం జాతర పరిసరాల్లో పనులు కొనసాగుతున్నాయని, పార్కింగ్ స్థలాల చదును, గుంతలున్న చోట స్టోన్‌డస్ట్ పనులు పూర్తిచేస్తున్నామని తెలిపారు. భక్తుల కోసం తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, లైటింగ్, తాత్కాలిక మరుగుదొడ్లు, ప్రత్యేక పారిశుధ్య ఏర్పాట్లు, క్యూలైన్లు, వైద్య శిబిరం, భద్రతా చర్యలు వంటి అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే సమ్మక్క--సారలమ్మ గద్దెల వద్ద కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. మూడు రోజుల పాటు జరిగే వన దేవతల జాతరను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవాలని పిలుపునిచ్చారు.

# కోర్టు రిజర్వాయర్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

## ఇంజనీర్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్




కరీంనగర్, జనతా న్యూస్ : కోర్టు రిజర్వాయర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంజనీర్ భవన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. శనివారం కరీంనగర్‌లో కోర్టు రిజర్వాయర్‌ను సందర్శించిన ఆయన, మంచినీటి సరఫరాకు సంబంధించిన సంపులు, మోటార్ పంపులను తనిఖీ చేసి పరిశీలించారు. నీటి సరఫరా జరుగుతున్న తీరును ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోర్టు ట్యాంకు వద్ద నూతనంగా నిర్మాణం చేస్తున్న ఇంజనీర్ భవన పనులను పరిశీలించి, ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. స్లాబ్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మంచినీటి సరఫరా కోసం నగరపాలక సంస్థ ద్వారా కొనుగోలు చేసిన పది నీటి ట్యాంకర్లను కూడా పరిశీలించారు. అనంతరం మానేరు డ్యాం సమీపంలో ఉన్న నగరపాలక సంస్థ ప్రకృతి వనాన్ని సందర్శించి, నర్సరీలో పెంచుతున్న వివిధ పండ్ల, పూలు, ఔషధ మొక్కలను పరిశీలించారు. మొక్కల సంరక్షణ చర్యలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకొని తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రిజర్వాయర్ నుంచి ప్రజలకు సమయానికి మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే అరికట్టాలని ఆదేశించారు.

అలాగే నర్సరీలలో మొక్కలను సక్రమంగా సంరక్షించాలని, రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మొక్కలకు సమయానికి నీటి తడులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ లచ్చిరెడ్డి, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.5.55 లక్షలతో విద్యుద్దీకరణ పనులకు శ్రీకారం

## చేపలవాడ నుంచి ఈనాడు చౌరస్తా వరకు మార్గానికి విద్యుత్ సదుపాయం




తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ కాలనీలోని చేపలవాడ నుంచి సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కేంద్రం మీదుగా ఈనాడు చౌరస్తా వరకు విద్యుద్దీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేపలకాలనీ వద్ద ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొత్తం 47 విద్యుత్ స్తంభాలతో ఈ మార్గాన్ని పూర్తిస్థాయిలో విద్యుద్దీకరించేందుకు ప్రభుత్వం రూ.5.55 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, అలాగే గురుకుల ప్రతిభా కేంద్రంలో చదువుతున్న విద్యార్థులు సాయంత్రం సమయాల్లో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజాబాట కార్యక్రమం కింద విద్యుత్ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలు, కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు చేపడుతోందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఈ రాజు, అల్గునూరు ఏఈ వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, మాజీ ఎంపీపీలు శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, మహాత్మానగర్ సర్పంచ్ పొన్నాల సంపత్, అల్గునూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మనవేణి రమేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, కంది లక్ష్మినారాయణ రెడ్డి, జాప ప్రశాంత్ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, మామిడి నరేందర్ రెడ్డి, సింగం శ్రీనివాస్, టి. అరవింద్, ఐతం మహేష్, మామిడి అనిల్ కుమార్, అట్ల అనిల్ కుమార్, ఎల్లారెడ్డి, చిందం కిష్టయ్య, కంబాల లింగయ్య, పురంశెట్టి అనోహర్, కాతా కొమురయ్య, ముంజ శ్రీకాంత్, ముంజ రాములు, కొమ్మ శ్రీనివాస్, మహేష్ యాదవ్, వీణెంక రవీందర్, సిల్లా రాములు, కుమార్, వినోద్, జంపయ్య, పోతుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ కార్డు లేనందున గర్భిణీకి వైద్యం నిరాకరణ అన్న వార్త అవాస్తవం

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. వీరారెడ్డి స్పష్టీకరణ

కరీంనగర్, జనతా న్యూస్ : ఆధార్ కార్డు లేనందున గర్భిణీకి వైద్యం నిరాకరించారన్న వార్తలో ఎలాంటి వాస్తవం లేదని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. వీరారెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 23 ఏళ్ల గర్భిణీ ఉబిడి రేఖకు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్దిష్ట సమయానికి అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. నాలుగు గర్భ పరీక్షలు, స్కానింగ్ సహా ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స అందించామని, అవసరమైన మందులన్నీ సరఫరా చేశామని పేర్కొన్నారు. ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది గర్భిణీకి అవసరమైన సమాచారం అందిస్తూ అవగాహన కల్పించారని తెలిపారు. ఆరోగ్య పరీక్షల సమయంలో ఆధార్ కార్డు ఉంటే తీసుకురావాలని మాత్రమే సూచించామని, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉంటేనే వైద్యం చేస్తామని ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు. ఉబిడి రేఖ, ఆమె గర్భంలోని శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని, ఆమె డెలివరీ అంచనా తేదీ 15.02.2026గా ఉందని తెలిపారు. మాతా--శిశు సంరక్షణ కేంద్రంలో ఆమె డెలివరీకి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఆధార్ కార్డు లేకపోవడం వల్ల సేవలు నిరాకరిస్తారన్న ప్రచారం పూర్తిగా తప్పుదోవ పట్టించేదని, ఇలాంటి వార్తల వల్ల పేద ప్రజల్లో భయం కలుగుతుందని పేర్కొన్నారు. ఆధార్ నంబర్ లేకుండా, గుర్తింపు పత్రాలు లేకుండా చికిత్స కోసం వచ్చే రోగులు, గర్భిణీ స్త్రీలకు కూడా ఎలాంటి వైద్య సేవలు నిరాకరించబోమని స్పష్టం చేశారు. నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది సహాయంతో వారికి పూర్తి స్థాయి వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

జనవరి 2026 నెలలో ఇప్పటికే రెండు కేసులు ఆధార్ కార్డు లేకుండానే కరీంనగర్ మాతా--శిశు సంరక్షణ కేంద్రంలో డెలివరీ అయినట్లు తెలిపారు. గత సంవత్సరం జనవరి నుంచి డిసెంబర్ వరకు మొత్తం 71 మంది గర్భిణీ స్త్రీలకు ఆధార్ కార్డు లేకుండానే చికిత్స అందించినట్లు వెల్లడించారు.

ఉబిడి రేఖ ఆసుపత్రిని సందర్శించిన ప్రతిసారి చికిత్స నిరాకరించిన సందర్భమే లేదని, డెలివరీ సమయంలో పత్రాల నమోదు కోసం మాత్రమే ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించామని తెలిపారు. దీనిని ఆమె తప్పుగా అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. వాస్తవాలను పరిశీలించకుండా ఇలాంటి వార్తలు ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అనవసర భయాందోళనలు ఏర్పడతాయని, ప్రజలు ఇలాంటి వార్తలను నమ్మవద్దని డాక్టర్ వీరారెడ్డి కోరారు.

# కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్‌లోకి భారీ చేరికలు

## రెండో డివిజన్ బిఆర్ఎస్ అభ్యర్థి నూతి చందు ఆధ్వర్యంలో చేరికలు



కరీంనగర్, జనతా న్యూస్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రెండో డివిజన్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్‌లోకి భారీ చేరికలు జరిగాయి. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నూతి చందు, మాజీ జెడ్పీటిసి నూతి వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం తీగలగుట్టపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జంగపల్లి మల్లయ్య తన అనుచరులతో కలిసి మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా జంగపల్లి మల్లయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, మోసపూరిత హామీల వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని, కరీంనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన గంగుల కమలాకర్ నాయకత్వంలో పనిచేయాలనే సంకల్పంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో రెండో డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నూతి చందును భారీ మెజారిటీతో గెలిపిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రెండో డివిజన్ అభ్యర్థి నూతి చందు, మాజీ జెడ్పీటిసి నూతి వెంకటేష్, తీగలగుట్టపల్లి మాజీ సర్పంచ్ జంగపల్లి మల్లయ్య, మాజీ ఎంపీటీసీ భూమయ్య, నాయకులు గుండేటి రవీందర్, సాగర్, చిరంజీవి, భాస్కర్ రెడ్డి, ఐలయ్య, రామ్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాంనగర్ మున్నూరు కాపు సంక్షేమ సంఘ భవనం ప్రారంభం

## కరీంనగర్ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దింది బిఆర్ఎస్ ప్రభుత్వమే

## మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్, జనతా న్యూస్ : బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో కేటాయించిన నిధులతో నిర్మించిన రాంనగ ర్ మున్నూరు కాపు సంక్షేమ సంఘ భవనాన్ని శనివారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ నగరానికి సుమారు రూ.1600 కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరీంనగర్ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో కరీంనగర్ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ప్రారంభించానని, అయితే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును నిలిపివేయడం చాలా బాధాకరమని అన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత అభివృద్ధి నిలిచిపోయి కరీంనగర్ నగరం గడ్డి దీపంగా మారిందని వ్యాఖ్యానించారు. రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గంగుల కమలాకర్‌తో పాటు మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, స్థానిక డివిజన్ మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, దిండిగాల మహేష్, మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, నాయకులు మిడిదొడ్డి నవీన్, కాపు కులస్తులు, డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# 57వ డివిజన్‌లో కలిసికట్టుగా బీజేపీ ఆశావాహుల ప్రచారం

## టికెట్ కంటే పార్టీ ముఖ్యం... పార్టీ కోసం పనిచేస్తాం

## ఆశావాహుల్లో ఎవరికిచ్చినా టికెట్... పార్టీ అభ్యర్థినే గెలిపిస్తాం



కరీంనగర్, జనతా న్యూస్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని లి57వ డివిజన్ (గణేష్ నగర్, దుబివాడ)లిలో భారతీయ జనతా పార్టీ టికెట్ ఆశిస్తున్న నేతలు శనివారం కలిసికట్టుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థిత్వానికి ఆశావాహులుగా ఉన్న నాయకులందరూ ఒక్కటిగా ప్రజల్లోకి వెళ్లి పార్టీ విధానాలు, లక్ష్యాలను వివరించారు.

ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో 57వ డివిజన్ నుంచి పోటీ చేయాలనే ఆసక్తి చాలా మందిలో ఉందని తెలిపారు. డివిజన్‌లో టికెట్ ఆశావాహుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, పార్టీ ఆదేశాలు, పార్టీ నిర్ణయాల ప్రకారమే అందరూ నడుచుకుంటామని స్పష్టం చేశారు. టికెట్ కోసం పోటీ ఉన్నా, టికెట్ కంటే పార్టీ ముఖ్యం అన్న భావనతో తామంతా పనిచేస్తామని చెప్పారు. డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తామని, ఆశావాహుల్లో ఎవరికిచ్చినా టికెట్ అయినా సమిష్టి కృషితో పార్టీ అభ్యర్థినే గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కల్లెం కవిత, వాసుదేవ రెడ్డి, తనకు సాయి ప్రియ (సాయి కృష్ణ), కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్, జంగాలపల్లి శ్యామల కుమార్, బొడ్ల ఆగమ్మ (శ్రీరాములు), కొత్తకొండ అరుణ్ కుమార్, సోమ మహేష్, దేవిశెట్టి నవీన్ కుమార్, పంకిర్ల రవీందర్, గుంటుక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com